ప్రజాశక్తి సోపతి
జనవరి 04, 2015 ఆదివారం అనుబంధం

జాతి వివక్షపై నిరసన స్వరం

ఆధునిక సాగు కేరాఫ్ అంకాపూర్

- ఆఖరికి: కొట్టం రామకృష్ణారెడ్డి కథ
- సోర్స్ కోడ్: జ్ఞాపకాలు పదిలం
- 'న్యూ మోల్' పై సమీక్ష
- అమ్మిన శ్రీనివాసరాజు, పొద్దుటూరి మాధవీలత కవితలు

బాలయ్య చిత్రాల్లో సహజ సౌందర్యం

'బతిక్ బాలయ్య'గా ప్రసిద్ధులైన యాసాల బాలయ్య తెలంగాణ చిత్రకళా ప్రముఖులలో ఒకరు. తొలుత బతిక్ ఆర్ట్ ద్వారా సుపరిచితులయిన బాలయ్య, తర్వాతి కాలంలో పెయింటింగ్‌లో రకరకాల ప్రయోగాలు చేశారు. మెదక్ జిల్లా సిద్ధిపేటకు చెందిన ఆయన చిత్రకళారంగానికి అంకితమై సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. తెలంగాణ పల్లెల్లోని స్త్రీ పురుషులు వారిదయిన సహజ సౌందర్యంతో బాలయ్య చిత్రాల్లో దర్శనమిస్తారు. వారి హావభావాలు, వ్యక్తీకరణలు ప్రాంతీయ నిర్దిష్టతని రంగరించుకొని బాలయ్య చిత్రాల్లో ఉట్టిపడుతుంటాయి. తెలంగాణ గ్రామాల్లోని ప్రాకృతిక వాతావరణాన్ని, పల్లెసీమల్లో తిరుగాడే శ్రమజీవుల్ని, ప్రత్యేకించి మహిళల జీవనశైలిలోని విభిన్నరీతుల్ని బాలయ్య చిత్రాలు ప్రతిఫలిస్తాయి. సంప్రదాయికత, ఆధునికత కలగలిసిన వారి చిత్రాల్లో ఒకవిధమైన విలక్షణ ఆకర్షణ దాగుంది.

■ అంతరంగం

ప్రశ్నించడం ఓ చైతన్యం

సామాజిక జీవితంలో అనేక అంశాల్ని ప్రశ్నించాలనిపిస్తుంది. కానీ మౌనంగా ఉంటారు చాలామంది. తమకెందుకులెమ్మని ఉపేక్షిస్తారు. ఈ ఉపేక్షభావాన్ని ఎదుటివారు అంగీకారయోగ్యంగా భావించే ప్రమాదముంది. ప్రశ్నించడం అనివార్యమైనప్పుడు ప్రశ్నించి తీరాలి. దేనినీ ప్రశ్నించకుండా ఉండడం జడస్థితికి సంకేతం. ప్రశ్నించడం చైతన్యపూరిత ఆలోచనాసరళికి చిహ్నం. 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా' అనే నవలని తన తండ్రికి అంకితమిస్తూ "మా నాన్నకు ఈ గ్రంథం ఎందుకు అంకితమిచ్చానంటే, 'ఎందుకు' అనే ప్రశ్న అడగడం నేర్పినందుకు" అని చెబుతారు గోపీచంద్. ప్రశ్నకు ఉన్న ప్రాధాన్యం అలాంటిది. ప్రశ్నలోనే మానవ పురోగతి ఇమిడి వుంది.

ప్రశ్నించకుండా అంగీకరిస్తూ పోతే ఇవాళ మానవజాతి ఇంత దూరంప్రయాణం సాగించి ఉండేది కాదు. ఇది ఇలానే ఎందుకు వుంది? మరోలా ఉండే అవకాశం లేదా? అని ప్రతి అంశాన్ని తొలినాళ్ళ మానవులు ప్రశ్నించారు కాబట్టే మరో అడుగు ముందుకు వెయ్యడం సాధ్యమైంది. ప్రశ్న నుంచి పుట్టిన ఆలోచన అన్వేషణకు దారితీసింది. ఏమిటి? ఎందుకు? ఎక్కడ? ఎలా? ఎవరు? ఎప్పుడు? అనే ప్రశ్నలు అడగడం వల్లనే ఒక స్థితి నుంచి మరో స్థితికి చేరుకోవడం వీలయింది.

ప్రశ్నకు ఉన్న ప్రాధాన్యాన్ని సుప్రసిద్ధ రచయిత, పత్రికా సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు ఇలా చెప్పారు: "ప్రశ్న నుండి పుట్టు పరిణత జ్ఞానమ్ము/ ప్రశ్న తోడ పెరుగు ప్రాభవమ్ము/ ప్రశ్న లేక ప్రగతి ప్రశ్నార్థకమ్మురా". నార్ల చెప్పిన ఈ మాటలు అక్షరసత్యం. ప్రశ్నించడం జ్ఞానార్జనకు సోపానం. ప్రశ్నించకుండా దేనినీ విశ్వసించకూడదు. జవాబులు దొరికేవరకు ప్రశ్నించడం మానకూడదు. జీవితంలోని సకల అంశాల్లో ఈ దృక్పథంతో వ్యవహరించడం అవసరం. సమాజ పురోగతికి, వ్యక్తులు విజయాలబాటలో ప్రయాణించడానికి ప్రశ్ననే కీలకం.

ప్రశ్నించడమంటే ధిక్కారంగా భావించకూడదు. కొన్నిసార్లు ధిక్కారంగా కనిపించవచ్చు. అయినా ప్రశ్నించడం తప్పదు. ఎందుకంటే ప్రశ్నించకపోతే మనుషులు నిలువనీరులా నిలిచిపోతారు. మూఢంగా నమ్మడం మొదలెడితే తమకు తాము మిగలరు. అందుకని ప్రశ్నించాల్సిందే. ప్రశ్నల్నించి తప్పించుకోవాలని చూసేవారిని నిలదీయాల్సిందే. జవాబుదారీతనానికి తాము అతీతులమని అధికారంలో వున్నవారు భావిస్తుంటారు. తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటారు. అలాంటివారిని సూటిగా, పదునుగా ప్రశ్నించడం ప్రజా చైతన్యానికి నిదర్శనం. ఈవిధంగా ప్రశ్నించడం ద్వారానే తమ మీద వివక్షనీ, పెత్తనాల్నీ ఎదుర్కొవడం సాధ్యం. కనుక ఏ రంగంలోనైనా అణచివేతకు లోనయ్యేవారు ప్రశ్నించి తీరాలి. అలాగే మనుషులు తమని తాము ప్రశ్నించుకుంటూ ఆత్మావలోకనం చేసుకోవాలి. సాటి మనుషులకు తక్కువ కీడు, ఎక్కువ మేలు జరిగేలా వ్యవహరించడం అవశ్యం.

వెంటాడే వాక్యం

ఇతరులను మోసం ద్వారా ఓడించడం కంటే తాను ఓడిపోవడమే గౌరవప్రదం. - అబ్రహం లింకన్

ప్రజాశక్తి

సోపతి

జనవరి 4, 2015

లేఖలు	4
సంగీతం తెలుగులో తక్కువే కానీ...	5
కవర్‌స్టోరీ	
ఆధునిక సాగు కేరాఫ్ అంకాపూర్	6
చిట్కాలు	
ఏం చూశారు? ఏం చదివారు?	9
కథ	
ఆఖరికి...	10
స్నేహాలు పరిచయాలుగా మారుతున్నాయా?	13
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
భూమీ లోటారం - గాలీ పటాలం	18
వికాసం చిరాకులు, చిర్రుబుర్రులొద్దు	19
సృజన జాతి వివక్షపై నిరసన స్వరం	20
సోర్స్‌కోడ్ జ్ఞాపకాలను పదిలపర్చుకుందాం	22
జోక్స్ కార్నర్	23
సమీక్షలు	
నయా ఉదార వాద విధానాలపై విశ్లేషణ	24
ఈ వారం కవిత్వం	
నీ కోసం...	26



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో శభాష్ అనిపించుకునేలా అంకాపూర్ వాసులు ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో అధిక దిగుబడులను సాధిస్తున్న కథనం...

లేఖలు



అవగాహన కలిగించాలి

ఏది 'నిర్భయ' భారతం? కవర్ స్టోరీలో మహిళలపై దాడుల గురించి చక్కగా వివరించారు. నిర్భయ చట్టం వచ్చిన తర్వాతనే ఈ దాడుగు పెరిగాయా అన్నట్లుంటున్నాయి రోజూ పేపర్ చదువుతున్నా, టీవీలో వార్తలు వింటున్నా. ఈ చట్టం వల్ల ఎవరికి మేలు చేకూరిందో అర్థం కావట్లేదు. చట్టాల్లో లొసుగులు, పరపతితో చట్టాల్ని చుట్టాలుగా చేసుకునే అవకాశం ఉన్నన్నాళ్లు ఇలాంటి నిర్భయ చట్టాలు ఎన్ని వచ్చినా మహిళలకు న్యాయం జరగదు. గతంతో పోల్చితే ఇప్పుడే నేరాలు, దాడులు పెరినట్లు తెలుస్తుంది. అంటే ఇంత టెక్నాలజీ లేక ఆ వార్తలు బయటికి రాలేదా, లేక నేరాలే జరగలేదా అనే సందేహం కూడా కలుగుతోంది. కేవలం చట్టాలు తీసుకొస్తే కాదు... వాటి పట్ల సమాజంలో అవగాహన కలిగించాల్సిన అవసరం కూడా ఉంది.

– కీర్తన, వరంగల్

పురోగమనమా? తిరోగమనమా?

'శీలమా? అదియేమి?' కథ నేటి సమాజంలో జరుగుతున్న కొన్ని అఘాయిత్యాలకు ప్రతీకగా ఉంది. ఈ కథలో విశ్వనాథం పాత్ర చాలా ఉన్నతంగా ఉంది. తన ప్రమేయం లేకుండా ఎరుర్కొన్న ఓ సంఘటనను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, అలాగే జరిగిన అన్యాయాన్ని పోలీసులకు తెలియబరిచి, అటువంటి నేరం చేసిన వారికి మళ్లీ అవకాశం ఇవ్వకుండా శిక్షించాలని చెప్పడం ఎంతో గొప్ప విషయం. సమాజానికి భయపడి నేరస్థులను వదలకూడదనే సారాంశంతో వచ్చిన ఈ క్లాసిక్ స్టోరీ ఇన్నేళ్లు గడిచినా ఇప్పటికీ అన్వయించుకునేలా ఉందంటే సమాజం పురోగమనంలో ఉందా? తిరోగమనంలో ఉందా అనే విషయాన్ని చెప్పకనే చెప్పినట్లుంది.

– రాజశేఖర్, హైదరాబాద్

అందరికీ అందుబాటులోకి వస్తే బాగుంటుంది

ఫొటోషాప్‌కు ప్రత్యామ్నాయంగా వచ్చిన జింప్ సాఫ్ట్‌వేర్ గురించి కొత్తగా తెలుసుకున్నాం. ఎక్కువ ఉపయోగాలతో, తక్కువ ఖర్చుతో లభిస్తున్న జింప్‌ను త్వరగా ప్రాచుర్యంలోకి తెస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ఉన్న కొద్దిపాటి లోపాలను సరిచేసుకుని త్వరలో అందరికీ అందుబాటులోకి వస్తే, ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించే వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– సూర్య ప్రకాష్, గజ్వేల్, మెదక్

జీవితాన్ని ఆస్వాదించాలి

జీవించడానికి, జీవితాన్ని ఆస్వాదించడానికి చాలా తేడా ఉంది. ఆ తేడాని గురించలేని వారికి అర్థమయ్యేలా చెప్పింది నవరాగంలోని 'ఎప్పుడయినా... సరదాగా...'.

– లక్ష్మీప్రసన్న, కూకట్‌పల్లి, హైదరాబాద్

ఇష్టమైన పనితో ఆనందం

ఏ వ్యక్తికయినా గుర్తింపుకు పరాకాష్ట నోబెల్ బహుమతి. దాని వెనుక వారి కృషి, పట్టుదల, కష్టనష్టాలు ఎలా వున్నా నచ్చిన పని చేసినప్పుడు వచ్చే ఆనందం వేరు. ఇది నోబెల్ గ్రహీత నెల్లీ సాచ్స్ గమనించవచ్చు. తల్లి తప్ప మిగతా కుటుంబ సభ్యులందర్నీ కోల్పోయినా నచ్చిన పనిలోనే ఆనందం వెతుక్కుంది. మొదట రాసిన రచనలన్నీ పోయినా పట్టించుకోకుండా వర్తమానం, భవిష్యత్తులోనే బతికింది. అదే ఆమెకు గుర్తింపునిచ్చింది.

– నర్సింహ, కరీంనగర్

మన జాతీయాలు

రాజుల పెండ్లి

అట్టహాసం, ఆడంబరాల మోజే ఎక్కువ. ఆధిక్యత నిరూపించుకునే తపన, తాపత్రయమే తప్ప అందులో ఆప్యాయత కరువే. గొప్పవారి పెళ్ళి సంబరాల్లో స్వయంగా వారే పాల్గొని చేసే పనులు తక్కువ. అంతా ధనబలంతో గొప్పతనాన్ని ప్రదర్శించే తమాషాగా కొనసాగుతుంది. పెట్టుపోతలు, లాంఛనాలు, బాజాభజంత్రీలు వీటి మోజే తప్ప పెళ్ళి చేస్తున్న పద్ధతిలో ఆర్ద్రత వుండదు. ఆత్మీయత వుండదు. "వేల రూపాయలు ఖర్చు అయ్యింది. రాజుల పెళ్ళి చేసిండు. ముందువెనుక చూసుకోలేదు. పోయినకాడ పిల్లకేం సుకం లేదట" అనటంలో ఈ జాతీయం వాడుకలోకి వచ్చింది.

గొండ వాయిదా

గోండులు ఆటవికులు. గిరిజన తెగకు చెందినవారు. కల్లాకపటం ఎరుగని వారు. మైదాన ప్రాంతం వారు ఒకటికి నాలుగింతలు ధర పెంచి ఇళ్ళలో గోండులకు సామాగ్రి ఇస్తుంటారు. పోడు వ్యవసాయం చేసుకుంటూ ఉన్ననాడు తిని, లేనినాడు ఉపవాసముండి, సారా తాగి కాలం వెళ్ళబుచ్చుతారు. అటవీ ఉత్పత్తులే ఆహార సముపార్జన సాధనాలు. గోండులు బాకీ ఎగవేయరు. తేనె దులిపినప్పుడో యిస్తామంటారు. బాకీ ఎగవేయకున్నా ఇదిగో అదిగో అని వాయిదాలు వేసేదాన్ని గొండ వాయిదాలంటారు. "ఏంది ఈ గొండ వాయిదాలు, ఇస్తే ఇస్తనను లేకుంటే లేదు" అనటంలో ఈ జాతీయం వాడకం చూడొచ్చు.

కాకి రోకలెత్తుకుని పోవుట

దుస్సాధ్యమయినది, కానిపని అని అర్థం. పులి తోకను గోరె కరిచెనన్న దానికి దగ్గర మాట ఇది. ఈ పని ఒక్కొక్కసారి జరుగుతుంది. చచ్చేవారు ప్రాణరక్షణకు చేసే పెనుగులాటలో ఈ పని జరగవచ్చు. కాని కాకి రోకలెత్తుకపోవుట అసాధ్యం. గన్‌మెన్‌లు నలుగురుండగ ఎంతో భద్రత వుండగా కూడా ఎవరో రాత్రి ఆయన ప్రాణాలు తీశారట. అంటే జవాబుగా "నువ్వు సరిగ్గా విన్నావా? కాకి రోకలెత్తుకపోయిందన్నట్లు ఇది జరిగే పనేనా?" అనటంలో ఈ జాతీయం ఉపయోగిస్తుంటారు.

బీరపూల యాల్ల

బీరపూలు సాయంకాలం సంజెవేళలో పూస్తాయి. గడియారాలు లేనప్పుడు మానవుని దినచర్య అంతా ప్రకృతితో ముడిపడి వుండేది. అంబటాళ్ళ, ఆకటాళ్ళ, పనుల యాళ్ళ, బీరపూలయాళ్ళ, కుందేలు మసక, చుక్క పొడంగ అన్నీ ఇలాంటివే. "బీరపూల యాళ్ళయింది. బతుకమ్మను తీసుక పోండ్రి. మళ్ళీ చీకటైతది రాంగ" అనటంలో ఈ జాతీయం వాడుతుంటారు.

– వేముల పెరుమాళ్ళు

■ **సంగీతం**

సినీ సంగీతంలో ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యక్తి ఎ.ఆర్.రెహ్మాన్. ఇళయరాజా, రాజ్-కోటి వంటి సంగీత దర్శకుల దగ్గర అసిస్టెంట్‌గా చేరిన రెహ్మాన్ చాలా తక్కువ కాలంలో అపార కీర్తి ప్రతిష్టలను అందుకున్నారు. వందేమాతరం అనే ప్రైవేటు అల్బంతో అంతర్జాతీయ గౌరవాన్ని పొందారు. ఈయన తెలుగు సినిమాలకు సంగీత దర్శకత్వం అందించింది చాలా తక్కువ. సూపర్ పోలీస్, పల్నాటి పౌరుషం, నాని, గ్యాంగ్ మాస్టర్ వంటి వాటిలో విజయవంతమైనవి ఇంకా తక్కువ. డబ్బింగ్ చిత్రాలతోనే తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. రోజా, బొంబాయి, ప్రేమదేశం, సఖి, జీన్స్, జంటిల్ మాన్, ఒకే ఒక్కడు, రోబో వంటి చిత్రాలలోని అన్ని పాటలూ ప్రేక్షకులను ఎంతగా ఉర్రూతలూగించాయో తెలిసిన విషయమే. 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంతో 'గోల్డెన్ గ్లోబ్' అవార్డును సొంతం చేసుకున్న మొదటి భారతీయుడుగా పేరు తెచ్చుకున్నారు. ఆయన సంగీతం వహించిన పాటల్లో కొన్ని...

సంగీతానికి అపార శక్తి ఉంది. సంగీతం వింటుంటే ఎంత హాయిగా ఉంటుందంటే వాన పడి కొండా కోనకి సంతోషం తెచ్చినట్టు, పూలొచ్చి పలకరించినట్లు వుంటుందట. ప్రభుదేవా, కాజోల్ నటించిన 'మెరుపు కలలు' చిత్రంలో వేటూరి రచించిన పాట "ఓ వాన పడితే ఆ కొండా కోనా హాయి. పూలొచ్చి పలికే సంపంగి భావాలోయి. కోయిలకే కూకూకూ.. ఎద హోరే కాంబోజీ... సంగీతమంటేనే హాయి హాయి..." పాటను సుజాత పాడారు.

కృష్ణంరాజు, రాధిక అన్నాచెల్లెళ్ళుగా నటించిన 'పల్నాటి పౌరుషం' చిత్రంలో బాలసుబ్రహ్మణ్యం, శుభా శంకర్ పాడిన "మాగాడి గట్టుమీద రాగాల పాలపిట్టరో, ఉయ్యాల పాటతోటి ఊరంతా గోల పెట్టెరో" పాటలో అన్నా చెల్లెళ్ల అనురాగమే కాదు, వారి పిల్లల పట్ల వీరికి మేనత్త, మేనమామగా ఎంతటి ప్రేమాభిమానాలు, హక్కులుంటాయో కళ్ళకు కట్టినట్లు చూపించారు.

అమ్మాయి అయినా, అబ్బాయి అయినా లక్ష్యం మరిచి ప్రేమలో పడితే ఓటమే మిగులుతుంది అనడానికి ఉదాహరణ 'ఒకే ఒక్కడు' లోని "షకలక బేబీ షకలక బేబీ లుక్కు చేయ తోచలేదా, షకలక బేబీ షకలక బేబీ లవ్వు చేయ తోచ లేదా?". వినడానికి ఫాస్ట్ బీట్‌తో పాప్ సాంగ్‌లా అనిపించినా ఎంతో పాపులర్ అయిన పాట ఇది. ప్రవీణ్ మణి, వసుంధర దాస్, దేవన్ పాడారు.

ప్రేయసి కోసం వెతుకుతున్న ప్రియుడు తన మనసులోని భావాలని వెలిబుచ్చే పాట 'ప్రేమికుల రోజు'లోని ఉన్నిమీనన్, కవితా కృష్ణమూర్తి పాడిన "దాండియా ఆటలు ఆడ సరదా పాటలు పాడ, గుజరాత్ పడుచులు ఆడ ప్రియుడే చెలికై చూడ, చెలి కనిపించేనా కనుచాటుగ నాకు, తన ప్రేమ చెప్పేనా ఈనాడు, చెలి కనిపించేనా కనుచాటుగ నాకు".

ప్రకృతిలో ఆశ్చర్యపోవాల్సిన వింతలూ, విశేషాలు, విడ్డూరాలు ఎన్నో వున్నాయి. మనం నిత్యం చూసే పూలనే తీసుకోండి... చూస్తుండగానే పువ్వు పండుగా తయారవుతుంది. మల్లీ పండులోని గింజనుండి వచ్చిన మొక్కే చెట్టుగా తయారై మల్లీ పూలు, పండ్లనిస్తుంది. ఇలాంటి ఎన్నో వింతల సమాహాలన్నింటినీ ఒక చోట చేర్చి పాటగా కూర్చితే వచ్చే పాటే 'జీన్స్' చిత్రంలో ఉన్ని కృష్ణన్, సుజాత పాడిన "పూవుల్లో దాగున్న పళ్ళెంతో అతిశయం, ఆ సీతాకోక చిలుక ఒళ్ళెంతో అతిశయం, వేణువులో గాలి సంగీతాలే అతిశయం, గురువెవ్వరు లేని కోయిల పాటే అతిశయం, అతిశయమే అచ్చెరువొందే నీవే నా అతిశయం"

సంగీతం హాయిని, ప్రశాంతతను ఇవ్వడమే కాదు, హాయిగా నిద్ర పుచ్చుతుంది కూడా. ఇలాంటి కోవకే చెందుతుంది 'ఇందిర' చిత్రంలోని వేటూరి రచించిన "లాలీ లాలి అంటూ రాగం పాడుతుంటే ఎవరూ నిదురపోరే, చిన్నబోదా మరి చిన్ని ప్రాణం... కాసే వెన్నెలకు వీచే గాలులకు హృదయం కుదుట పడదే, అంత చేదా మరి వేణుగానం, కళ్ళు మేలు కుంటే కాలమాగుతుందా భారమైన మనసా"పాట. ఈ పాటను హరిణి గానం చేశారు.

తెలుగులో తక్కువే కానీ...

జీవితంలో కష్ట సుఖా లను, ఒడిదుడుకులను తట్టుకునే శక్తి కుటుంబ సభ్యుల కంటే కూడా ఒక్కో సారి స్నేహితుల ద్వారా లభిస్తుంది. అలాంటి స్నేహితులు దొరికేది కాలేజీ రోజుల్లోనే. ఆ వయసు లో స్నేహితులు కాలేజీ లో పరిచయ మయ్యేది మొదట ర్యాగింగ్‌తోనే. శృతి మించని ర్యాగింగ్ కూడా మంచే చేస్తుందనటానికి 'ప్రేమదేశం' చిత్రంలోని "ముస్తఫా ముస్తఫా డోంట్ వర్రీ ముస్తఫా... కాలం నీ నేస్తం ముస్తఫా, డే బై డే డేబైడే కాలం వొడిలో డేబైడే పయనించే షిప్పే ఫ్రెండ్‌షిప్‌రా" భువన చంద్ర రాసిన ఈ పాటని ఎ.ఆర్.రహమాన్ పాడారు.

ఆశ లేనిదే మనిషి మనుగడ లేదు, జీవితం లేదు. ఏదైనా సాధిసామన్న ఆశ ఉంటేనే బతుకు ముందుకు సాగుతుంది. ఆ ఆశ స్వేచ్ఛ కోరేదైతే... ప్రకృతి మొత్తం తానే విహరించాలనుకుంటే... 'రోజా' చిత్రంలో రాజశ్రీ రచనకు మిన్ మిని గాత్రంలో ప్రాణం పోసుకున్న పాట "చిన్ని చిన్ని ఆశ చిన్నదని ఆశ.. ముద్దు ముద్దు ఆశ ముత్యమంత ఆశ...జాబిలిని తాకి ముద్దులిడు ఆశ, వెన్నెలకు తోడై ఆడుకొను ఆశ".

రేపు అన్నది కాకుండా నేడు అన్నదే మనుషులకు ముఖ్యం. కలలు, ఆశల కలబోతే జీవితం. రేపు కనిపించబోయే స్వప్నాన్ని కాకుండా నేడు కనిపించే దాన్నే నమ్ముతాం అనే అర్థంతో వచ్చిన పాట 'ప్రియురాలు పిలిచింది' చిత్రంలోని సాధనా సర్గమ్ పాడిన "పలికే గోరింకా చూడవే నావంక... ఇక వినుకో నా మది కోరికా, అహ నేడే రావాలి నా దీపావళి పండగ, రేపటి స్వప్నాన్నీ నేనెట్టా నమ్మేదీ, నే నాటికె రోజా నేడే పూయునే".

ఇలాంటి ఎన్నో ప్రేక్షకులకు నచ్చే, మెచ్చే పాటలకు సంగీతం సమకూర్చి నాలుగు సార్లు జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడిగా, 19 ఫిలిం ఫేర్ అవార్డులను అందుకున్నారు.

- బి.మల్లేశ్వరి

■ కవర్ స్టోరీ

ఆధునిక సాగు కేరాఫ్ అంకాపూర్

నిజామాబాద్ జిల్లా అంకాపూర్ ఆధునిక సేద్యపు పరిశోధనల ఒడి. అక్కడి అన్నదాతలు 'రైతే రాజు' అన్న నానుడికి నిత్య సత్యం. ప్రస్తుతం రాష్ట్ర మంతా ఖరీఫ్ కరువు ఛాయలు అలుముకున్నా.. అంకాపూర్‌లో మాత్రం ఆరుతడి పంటలతో సాగును వినూత్న పుంతలు తొక్కిస్తున్నారు. ఫలితంగా అనావృష్టిలోనూ ఏరువాక సాఫీగా సాగుతోంది. కాలం కలిసివస్తే దిగుబడిలో మేటే. అందుకే ముఖ్యమంత్రి కేసిఆర్ చేత శబాష్ అనిపించుకున్నారు. ఇంతకీ అంకాపూర్ సేద్యం పద్ధతులు ఏమిటీ.... శాస్త్రీయ పరిజ్ఞానం ఎక్కడిదో తెలుసుకుందాం...

అంకాపూర్ గ్రామంలో 10,596 ఎకరాల సాగు నేలలు ఉన్నాయి. అందులో కేవలం 60 ఎకరాల్లో మాత్రమే వరి సాగవుతోంది. మిగతా విస్తీర్ణంలో మొక్కజొన్న, సజ్జలు, సోయా, కూరగాయలు ఇతర ఆరుతడి పంటలనే రైతులు సాగు చేస్తారు. ప్రధానంగా స్వల్పకాలిక పంటలను ,ఆరు తడి పంటలను ఎంచుకోవడంలో వీరికివీరే సాటి. అందుకు వీరి పంట క్షేత్రాల్లో నిరంతరం పచ్చగా ఉండే కొత్తిమీర మళ్లు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అంకాపూర్ గ్రామంలో సుమారు 600 ఎకరాల్లో కొత్తిమీర పండుతోంది. కాలంతో సంబంధం లేకుండా ఇది సాగవుతోంది. ఎకరం కొత్తిమీర పండించేందుకు పదివేల వరకు సాగువ్యయం అవుతోంది. 45 రోజుల్లో చేతికి వచ్చే పంటకు కేవలం రెండు సార్లు మాత్రమే కలుపు తీయాల్సి ఉంటుంది. రెండు రోజులకోసారి పంటను కోస్తూ అమ్మకానికి తరలిస్తారు. కొత్తిమీర వ్యాపారులు ఇక్కడి రైతులతో ఒప్పందం చేసుకుని మహారాష్ట్రలోని నాందేడ్, ఔరంగాబాద్, నాగ్‌పూర్‌తో పాటు రాష్ట్రంలోని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు తదితర ముఖ్యపట్టణాలకు రవాణా చేస్తున్నారు. పంట పూర్తిగా అమ్మకాలు పూర్తయ్యే వరకు దాదాపు లక్ష వరకు ఆదాయం వస్తోంది. ఇలా అతి తక్కువ సమయంలో అధిక మొత్తంలో లాభం పొందడం వీరి సాగు పద్ధతుల్లో ఒకటి. ఇదిలా ఉండగా కూరగాయాల సాగులోనైతే అంకాపూర్ రైతులు విప్లవమే సృష్టించారు.

ఈ ఏడు కరువుకు ఎదురీత....

2014 ఖరీఫ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయి. నిజామాబాద్‌లోనూ పరిస్థితి భిన్నమేమీ లేదు. కానీ అందుకు ఆర్మూర్ ప్రాంతంలోని అంకాపూర్ గ్రామం మాత్రం మినహాయింపుగా నిలిచింది. జిల్లాలో సీజన్ ప్రారంభంలో రెండు నెలలపాటు సాధారణ వర్షపాతాని కంటే 60మి.మిశాతం లోటు వర్షపాతమే నమోదైంది. ఈ పరిస్థితుల్లోనూ అంకాపూర్‌లో సాగు సాఫీగా సాగుతోంది. ప్రధానంగా ఆరుతడి

పంటలపై దృష్టిపెట్టడంతోనే ఈ సమస్యను సమర్థంగా రైతాంగం ఎదుర్కొంటోంది. అంతేగాక ఆరుతడి పంటల్లో స్వల్పకాలిక, తక్కువ పెట్టుబడి పంటలకే ప్రాధాన్యత ఇవ్వడంతో వ్యవసాయంగా లాభదాయకంగా మారుతోందని స్థానిక అన్నదాతలు చెబుతున్నారు. ప్రతి ఐదు నుంచి పది ఎకరాలకు ఒకటి చొప్పున నీటి తొట్టి పొలం ఎగువ భాగాన నిర్మిస్తారు. దీనికి నాలుగు నుంచి ఐదు లక్షల వరకూ వెచ్చిస్తారు. ఇక్కడంతా బోరు బావులపై ఆధారపడి జరిగే సేద్యం కావడంతో కరెంటు ఉన్న వేళల్లో నీటి తొట్టెల్లో నీరు నిల్వ చేస్తారు. దీన్ని ఎగువ నుంచి పల్లపు ప్రాంతాల్లో అవసరమైన చోట నీటిని విడుదల చేయడానికి పైపులైన్ నిర్మాణం ఉంటుంది. దీంతో పది ఎకరాల విస్తీర్ణంలో ఏ పంటకు నీరు అవసరమో అక్కడి మళ్లలోనే నీరు పారుతోంది. తద్వారా చుక్కనీరు కూడా వృథా అవ్వదు. ఇదే పంట ఏ కాలంలోనైనా సజావుగా సాగేలా దోహదపడుతోంది.

వ్యవసాయ ప్రయోగశాలే...

పంట మార్పిడి, సేంద్రియ ఎరువుల వాడకమే అధిక దిగుబడికి మూలం. అంకాపూర్‌లో ఆవులు, గొర్రెలు, మేకలు కలిపి 14705 వరకు ఉన్నాయి. అంటే పాడి సంపదపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వీటి వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా వినియోగిస్తారు. పసుపు విత్తు నాటేముందు నేలలో రెండు లారీల వరకు పశువుల పేడ చల్లుతామని స్థానిక రైతాంగం చెబుతున్నారు. సామూహిక వ్యవసాయంతో చీడపీడల భయాన్ని జయించారు. ప్రతి మూడు నెలలకోసారి పంట మార్పిడి అత్యంత మెరుగైన ఫలితాలు రాబడికి ప్రధాన కారణమని ఇక్కడికి వచ్చే శాస్త్రవేత్తలు సైతం కితాబివ్వక తప్పని పరిస్థితి. ఇక ఇక్కడి నేలలు విత్తనోత్పత్తికి అనువుగా ఉండటం కలిసివచ్చింది. దీంతో గ్రామ చుట్టుపక్కల్లో 50కిపైగా విత్తనోత్పత్తి కేంద్రాలు వెలిశాయి. రైతులే స్వయంగా

కష్టపడే తత్వంతోనే...

రైతులంతా కష్టపడి పనిచేస్తారు. ఉదయం నాలుగు గంటలకే దినచర్య ప్రారంభమవుతుంది. 7 గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు పొలాల్లోనే ఉంటారు. కొత్త సాగు పద్ధతుల గురించి అంతా ఐకమత్యంగా చర్చించుకుంటారు.'

– సిరిసిల్ల పుష్ప క్రాంతి, అంకాపూర్ సర్పంచి

పంటమార్పిడితోనే సత్ఫలితాలు

'పంట మార్పిడి క్రమం తప్పకుండా పాటిస్తాం. అందుకే దిగుబడిలో అద్భుతమైన ఫలితాలు సాధించగలుగుతున్నాం. పది ఎకరాలు ఉంటే పలు రకాల పంటలు వేస్తాం. మార్కెట్‌లో ఏ ఒక్క పంటకు రేటు పలికినా రైతు గట్టెక్కుతాడు'.

– భోజన్న, రైతు సంఘం నాయకుడు అంకాపూర్

సేంద్రియ ఎరువులే ఎక్కువగా వినియోగిస్తారు

అంకాపూర్ భూములు ఎర్ర, చెలక నేలలు. ఇక్కడి రైతులు ఎక్కువగా పంట కోసం సేంద్రియ ఎరువులే వినియోగిస్తారు. పశువుల పేడ, చెరువుల మట్టి, పౌల్ట్రీ విసర్జలు (కోళ్ల) ఎరువులుగా వాడుతారు.

ఖరీఫ్ ప్రారంభానికి ముందే పశువుల పేడ ఎకరానికి లారీ నుంచి రెండు లారీల వరకు చల్లుతారు. పంట అవశేషాలను రోటవేటర్‌తో తొక్కిస్తారు. పంట మధ్యలో కొద్దిగా రసాయనిక ఎరువులను కూడా వాడాతారు. దీంతో భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. సూక్ష్మపోషకాలు (జింక్, మాంగనీస్, ఐరన్) పెరుగుతాయి. సూక్ష్మజీవుల ప్రక్రియ పెరగడంతో భూసార సమతుల్యం కాపాడే జీవులు వాన పాములు ఇతరత్రా జీవించే అవకాశం ఉంటుంది. వరి పంట తక్కువగా సాగుచేస్తారు. స్వల్పకాలిక పంటలకు ఎక్కువగా మొగ్గు చూపుతారు. పంటమార్పిడికి ఎక్కువగా చేస్తారు. ప్రతి ఏడాదిలో కనిష్టంగా నాలుగు, గరిష్టంగా ఐదు పంటల వరకు పండిస్తారు. పంటల సాంద్రత ఎక్కువగా ఉంటోంది. మార్కెట్‌కు అనుగుణంగా పంటలు వేస్తారు. నీటి సంరక్షణకు నీటి తొట్టెలు వారుతారు. మిగతా చోట్ల మాదిరి కాకుండా 2 నుంచి 2.5 రేట్లవరకు నీటి వినియోగం ఉంటుంది. ఎక్కువగా నీటి వినియోగం చేస్తారు. స్థానికంగా మార్కెట్ ఉంది. కొత్త పద్ధతులు ఎప్పటికప్పుడు తెలుసోవడంతో పాటు సమిష్టి వ్యవసాయం చేస్తారు.

– గోపి, ఆర్మూర్ వ్యవసాయ అధికారి

వ్యవసాయం లాభ సాటిగా ఉంది

మాకు ఆరు ఎకరాల భూమి ఉంది. ఇంతకు ముందు (ఖరీఫ్‌లో) సోయా, మొక్కజొన్న, కందిపంట వేశాను. ఇప్పుడు పసుపు, జొన్న వేశాను. 3 నెలల పంటలు ఎక్కువగా వేస్తాం. పసుపు వేయకముందు ఆరోనెలలో (జూన్)లో చెరువు మట్టి పోశాను. ఎకరానికి 4 టిప్పర్లు చెరువు మట్టి పోశాం. పేడ లారీకి రూ.15వేలు ఉంటుంది. రెండు లారీలు పోశాను. ఆ తర్వాత రెండోసారి మొక్కజొన్న పంట సమయాన్ని బట్టి యూరియా వేశాను. మొత్తం మొక్కజొన్నకు ఎకరాకు పదివేలు పెట్టుబడి పెట్టాను. రూ.35వేల వరకు ఆదాయం వచ్చింది. పెట్టుబడి పోను 20వేలు మిగిలాయి. మాకు వ్యవసాయం లాభ సాటిగానే ఉంది.' అని బిఇడి పూర్తి చేసిన గుండు శేఖర్ వివరించారు.

– గుండు శేఖర్, రైతు

ఎరువులతో నష్టపోతాం

‘దుక్కి దున్నిన తర్వాత సూర్య కిరణాలు పడుతాయి. అది భూమికి మంచిది. ముందులు వేస్తే భూమి నాశనమైతది. 20 ఏళ్ల నుంచి ముందు వేయకుండా పసుపు పండిస్తా.’ అని నడిపి గంగారాం చెప్పారు. ఇలాంటి పద్ధతి మాకు ఎలా తెలిసింది.. అడిగితే... దాదాపు 20ఏళ్ల కింద పసుపుకు మందు చల్లుతుండగ నా నాలుగు ఎకరాల పంట మొత్తానికి వేయకముందే అయిపోయింది. మిగతా పావు ఎకరానికి మళ్లీ కొని వేసే వీలులేక ముందు వేయలేదు. ఈ చోటే దిగుబడి ఎక్కువ వచ్చింది. మిగతా మందు చల్లిన చోట పంట సరిగ్గా రాలేదు. ఇట్లా అనుభవంతోనే.. కొత్త పద్ధతుల్లో పసుపు పండిస్తున్నా. ఎక్కువ పేడ ఎరువులే వేస్తా. పసుపుకు ఎరువు ఎకరానికి లారీ 6 టన్నుల పేడ ఎరువు చల్లుతాను. అక్టోబర్‌లో రెండు నైట్రోజన్ బస్తాలు యూరియా వేస్తాం అంతే’. అని దాదాపు 1988 నుంచి పసుపు పండిస్తున్న రైతు పేర్కొన్నారు. ఇప్పుడు మొక్కజొన్న, జొన్న పంటలకు కూడా మందులు వేయకుండా పండించే ప్రయత్నం చేస్తున్నా.ఇంకా పూర్తిగా కుదరడం లేదు. ఇప్పటికే తగ్గించినం. మొక్కజొన్న విత్తనం మొలిసిన 15 రోజులకు మొక్కజొన్న మొదట్లో అరపిట్ మన్ను కప్పాలి. అంటె చుట్టు పక్కల గడ్డిపెరుగదు.’ ఎకరా మొక్కజొన్నకు విత్తనాలకు వెయ్యి, 4వేల ఎరువులు, 5వేలు కలుపు ఖర్చు అవుతాయి. మొత్తం 10 వేలు ఖర్చు అవుతాయి. ఎకరానికి 40 క్వింటాళ్లు మొక్కజొన్న పండిస్తా. 30 వేల వరకు ఆదాయం వస్తోంది.’ అని వివరించారు.

‘కొత్తిమీర 45 రోజుల పంట. ఎకరాకు విత్తనాల కోసం 15వేల వరకు ఖర్చవుతాయి. నీటి సౌకర్యం ఉంటే చాలు. కలుపు ఖర్చు కూడా ఉండది. క్వింటాలుకు 8000 ఉంటే ఎకరానికి 10 టన్నులకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తోంది. అంటే దాదాపు రూ. 20వేల పెట్టుబడి కింద పోయినా.. గిట్టుబాగానే ఉంటోంది. కానీ ప్రస్తుతం అంకాపూర్‌లో కొత్తిమీర ధర కిలోకు రూపాయకి పడిపోడంతో రైతులకు నష్టం కలుగనుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్వల్పకాలిక పంట కావడంతో వెంటనే మార్కెట్‌లో ధర పలికుతున్న మరో పంటతో గట్టెక్కేందుకు వీలు ఇక్కడి రైతులకు ఉండటమే వీరి సాగు సక్సెస్ మంత్ర.

– పుప్పాల నడిపి గంగారాం

ఒకేతీరు పంటలు వేయం

నాలుగు ఎకరాల్లో కొంత పసుపు, కంది పంట వేసినం. అంతకుముందు సోయా, ఎర్రజొన్న పండించినం. ఒకే తీరు పంటలు అసలే వేయం. మహిళలం ఎక్కువగా కష్టపడుతాం. సకాలంలో కలుపు తీపిస్తాం. దీంతో దిగుబడి పెరుగుతోంది.

– నర్సవ్వ, మహిళా రైతు

నాణ్యమైన విత్తనాలను తయారు చేసి దేశవ్యాప్తంగా ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి రైతులు సృష్టించిన పసుపు, ఎర్రజొన్న వంగడాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఇదే పద్ధతిలో ఆర్మూర్ ప్రాంతమంతా రైతాంగం కొనసాగించే ప్రయత్నం చేశారు. కానీ విత్తన వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి రైతులను నష్టపరచడంతో విత్తనోత్పత్తిపై ఆసక్తి తగ్గిపోయింది. మార్కెట్‌లో డిమాండ్ లేదంటూ అమాయకులైన రైతులను మభ్యపెట్టి తక్కువ ధరకు విత్తనాలు కొనుగోలుచేసి రెట్టింపు ధరకు అమ్మకుని అప్పణంగా లాభాలు పొందేవారు. దీంతో విత్తనోత్పత్తి రైతులకు గిట్టుబాటు కాకుండా పోయింది. ప్రయివేటు విత్తన వ్యాపారులను నియంత్రించి, ప్రభుత్వం శాస్త్రవేత్తలతో నాణ్యమైన మూల విత్తనాలను రూపొందించి రైతులకు నేరుగా ఇస్తే ఎక్కువ డిమాండ్ లభిస్తుంది. దేశ, విదేశీ కంపెనీల వారు వచ్చినేరుగా రైతుల నుంచి విత్తనాలు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. రైతులకు ప్రయోజనం చేకూరుతోంది. అ విధంగా మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపర్చాల్సి ఉంది. అప్పుడే రైతాంగం విత్తనోత్పత్తి వైపు మొగ్గుచూపే అవకాశాలు పెరుగుతాయని రైతు సంఘం నాయకులు పేర్కొంటున్నారు.

అప్పట్లో అంకాపూర్ అంతంతే..

ఒకప్పుడు అంకాపూర్ అన్ని గ్రామాల్లాంటిదే. భూములన్ని నిజాం సంస్థానంలో ఉండటంతో బాధలన్నీ షరామామూలే. రైతాంగంపై అప్పుల భారం, సాగు సంక్షోభం తప్పలేదు. ఈ భూములను ఆధీనంలో ఉంచుకున్న వెంకట భూమారెడ్డి అనే జమీందారు తన మకాం హైదరాబాద్‌కు మారుస్తూ.. ఆ భూముల్ని అమ్మివేయడంతో స్థానిక రైతులకు భూములు దక్కాయి. ఆ తర్వాత గ్రామం నుంచి ఉపాధి కోసం విదేశాల వెళ్లినవారిలో కొందరు తిరుగుముఖం పట్టారు. ఇక్కడ సాగు చేస్తూ ఆయా దేశాల సాగు పద్ధతులను స్థానికంగా అవలంబించడం ప్రారంభించారు. ఇప్పటికీ ఈ గ్రామానికి చెందిన 189 మంది విదేశాల్లో ఉన్నారు. ఇదే ఆ పల్లె ప్రగతికి బాట వేసింది. క్రమక్రమంగా పల్లె స్వభావమే పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాలు తలపించే విధంగా భవనాలు నిర్మితమయ్యాయి. 2011 లెక్కల ప్రకారం ఈ గ్రామ జనాభా 5689. అంతా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలే. దాదాపు ప్రతి ఇంటి ముందు బైకు లేదా కారు తప్పని సరిగా ఉంటోంది. మార్కెట్లోకి ఏ కొత్త బైకు వచ్చినా అంకాపూర్‌లో ప్రత్యక్షం కావాల్సిందే. అది అంకాపూర్ స్థాయి ఇప్పుడు.

– బొక్కల లక్ష్మయ్య, నిజామాబాద్

■ చిట్కాలు

ఏం చూశారు? ఏం చదివారు?

మనం చూస్తుండగానే 2014 సంవత్సరం గడిచిపోయింది. గతాన్ని అలాగే వదిలేయక్కర్లేదు. కొన్ని విషయాల్ని గుర్తు చేసుకోవాలి. కొన్నిటిని డైరీలోనో, కంప్యూటర్‌లో పర్సనల్ ఫోల్డర్‌లోనో రికార్డు చేసి పెట్టుకోవాలి.

మీ గురించి మీరు మరెప్పుడైనా అవలోకించేప్పుడు ఇవి ఉపకరిస్తాయి.

◆ 2014లో మీరు ఎన్ని సినిమాలు చూశారు. థియేటర్‌కు వెళ్ళి చూసిన సినిమాలెన్ని, ఇంట్లో కంప్యూటర్‌లో చూసిన సినిమాలు ఎన్ని? అందులో మీకు బాగా నచ్చి గుర్తుండిపోయిన సినిమాలేమిటి? వీటి జాబితా రాయండి.

◆ కొన్ని సినిమాలు, ఆ సినిమాల్లోని పాత్రలు గుర్తుండిపోతాయి. అలాంటి విషయాల్ని వివరంగా ఒక డైరీలో రాసుకోవడం మంచిది. ఎందుకంటే సినిమా అన్నది మన మీద చాలా ప్రభావం చూపుతుంది. గుర్తుండిపోయి తలపుల్లోకి వస్తుంటుంది. కనుక సినిమాల విశేషాలు విపులంగా రాయడం మంచిది.

◆ మీరు పదేపదే విన్న పాటల గురించి వరుసక్రమంలో రాయండి. మరల మరల వినాలనిపించిన పాటల జాబితా తయారు చేయండి.

◆ 2014లో మీరు ఏం పుస్తకాలు చదివారు? వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకాలేమిటి? వాటన్నిటి పేర్లు రాయండి. మిమ్మల్ని బాగా కదిలించిన పుస్తకాలేమిటో చూడండి.

ఈవిధంగా రాయడమే కాదు, మీరు మెచ్చిన, మీకు బాగా నచ్చిన పుస్తకాలు చదివినప్పటి అనుభూతుల్ని ఒక చోట చేర్చండి. మంచి పుస్తకాల గురించి మీ మిత్రులకు చెప్పండి.

మీకు తెలుసా?

కొన్ని విషయాలు చిత్రంగా అనిపిస్తాయి. నిర్దిష్టంగా గమనిస్తే ఆశ్చర్యానికి లోను చేస్తాయి. అలాంటి కొన్ని వాస్తవాలు ఇక్కడ చదవండి.

◆ ప్రపంచ జనాభాలో చైనాది అగ్రస్థానం. కానీ వారికున్న ఇంటిపేర్లు కేవలం 200 మాత్రమే.

◆ ఎడంచేతి వాటం గలవారు తక్కిన వారికన్నా తొమ్మిదేళ్ళు తక్కువగా జీవిస్తారు.

◆ ఇంటర్‌నెట్‌లో వారానికి పదివేల కొత్త సైట్లు వచ్చి చేరుతుంటాయి.

◆ అనధికారిక అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 15,000 టీవీ చానెల్స్ వున్నాయి. ప్రైవేట్, కేబుల్, ప్రభుత్వ చానెల్స్‌వన్నీ కలిపితే వచ్చిన సంఖ్య ఇది. ప్రతి నెల కొత్త చానెల్స్ ఎక్కడో చోట మొదలవుతూనే వుంటాయి.

◆ చానెల్ లోగో ఎక్కువగా టీవీ స్క్రీన్ పైన ఎడమచేతి వైపు పైన ఉంటుంది.

◆ ప్రపంచంలో 'వ్యక్తిత్వ వికాసం' భావన విశ్వవ్యాప్తం కావడానికి మూలకర్తలు నెపోలియన్ హిల్, అండ్రూ కార్నెగీ.

వదులుకోవాల్సిన సప్తవ్యసనాలు

వ్యసనం ఏదైనా మనుషులను పతనావస్థకు లోను చేస్తుంది. కనుక వ్యసనాల్ని అధిగమించినవారే జీవితంలో రాణించగలరు. మరీ ముఖ్యంగా మనుషులు వదులుకోవాల్సిన సప్తవ్యసనాలివి:

1. తాగుబోతుతనం
2. తిరుగుబోతుతనం
3. వ్యభిచారం
4. జూదం
5. వేట
6. క్రౌర్యం
7. చౌర్యం.

ఈ వ్యసనాలకు దూరంగా వున్నవారే జీవితంలో తాము అనుకున్నది సాధించేదిశగా ప్రయాణించగలరు. ✻

■ కథ : కొట్టం రామకృష్ణారెడ్డి

ఆఖిరికి...



అమెరికా నుంచొచ్చి అప్పుడే రెండ్రోజులు అయిపోయ్నాయి.

మూడు నెల్లు సెలవు పెట్టి పోయినం నేను, నా పెండ్లాం, బిడ్డ కాన్పు కోసరం. డాక్టరు చెప్పిన రోజు కంటే వారం ముందే కాన్పయింది. ఆడపిల్ల.

మా ఇంట్లనే ఉన్నట్టుంది...తాతకు, బాపుకు, అక్కకు, నాకు ఇంకా తమ్మునికి గూడ తొలి చూలు ఆడపిల్లె... గిప్పుడు నా బిడ్డెకి. రేపట్నాడు నా కొడుక్కాడ గిట్లనే అయితదేమో.

ఆఫీసుల అర్జంటు పనని, నా పెండ్లాన్ని గాడ్నే కొన్ని రోజులుండమని జెప్పి నేను హైదరాబాదొచ్చిన. ఇంకా ఆరం దినాలు మిగిలే ఉన్నయి ఆఫీసుల జాయిన్ గానీకె.

రెన్నెల్లు ఇంట్ల లేకపోయేసరికి దుమ్ము దుమ్మయ్యింది ఇల్లంత. మొత్తం సాఫ్ జేసి, పాత బిల్లులు కట్టేటివి వుంటే కట్టేస్న. ఇల్లంత ఇంతకు ముందులెక్క జేశేట్యాల్లకు రెండు రోజులు అయిపోయ్నాయి. ఏ పన్లేకుండ ఉట్టిగుండుడు అస్సలు అలవాటులేక, ఇంకేం జెయ్యాల్నో సమజ్గాలె. బయటికి ఏడ్కి పోబుద్ధి గాలె, టీవి సూడుడు బంద్ జేసి శానా దినాలయినయి.

ఏదైనా సదువుదామని పుస్తకాలకోసం లెంకితే, ఏవి సదవదగ్గ పుస్తకాలు దొరకలే.

ఆయింతల యాదికొచ్చింది, నా పాత పుస్తకాలన్నీ అట్ట డబ్బలల్ల వెట్టి, బాత్రూమ్ మీదున్న అట్క మీద నా పెండ్లాం పడేసిన ఇసయం. కిందమీదవడి అటకమీదికెక్కి రెండు అట్టడబ్బాలను కిందికి దింపిన. ఇగ నడింట్ల ముందలేసుకుని గూసొని ఒక్కొక్క పుస్తకాన్ని బయటికి దీసి సూసుడు మొదల్వెట్టిన.

పోతన, దాశరథి, కాళోజీ, కొడవగంటి, శ్రీశ్రీ, చలం.. శానా పుస్తకాలు... సూస్కుంట... తిప్పుకుంట గూసున్న. ఒక్కొక్క పుస్తకాన్ని తీసి, దులిపి గట్ల తిప్పేస్తుంటే కడుపు నిండినట్టయ్యింది. నాకెట్ల మొదలైందో గీ పుస్తకాలు సదువుడు.

చలం 'మైదానం' దీసి తృప్తిగ నిమిరిన. ఎన్నేండ్లయ్యింది గిది సదివి. ఇడిసిపెట్టిన సిన్నప్పటి దోస్తును మల్లగిన్నేండ్లకి గలిసినంత సంబురమయ్యింది. అట్ల తిప్పుకుంట గూసున్న... ఎందుకో ఒక్కసారి పెయ్యి ఝల్లుమన్నది. యాడ్నో భూమి అడుగున దాసిపెట్టిన సంగతి, ఒక్కసారి ఎగదన్నుకుని బయలపడ్డట్టనిపించె. రెండు సేతుల నడుమ గుండెని బెట్టి పిసికినట్టయ్యింది. గట్టనే.. చానసేపు... ఏదో యాదిలకి పోయినట్టు కదలకుండ గూసున్న.

మల్ల తెల్లారి పొద్దున్నే ఏడిటికి కారు బయటికి దీస్న. హైదరాబాద్కి సరిగ్గ వంద కిలోమీటర్ల దూరం మహబూబ్నగర్. పి.వి.ఆర్. ఎక్స్ప్రెస్ వే మీదికెల్లి శంషాబాద్ డాటేటాల్లకి గంటయ్యింది.

చేతులు స్టీరింగు మీద, సూపులు రోడ్డు మీద ఉన్నా, మనసేమో కారు కంటే జోరుగా ఇరవై అయిదేళ్ళ ఎన్కకి జారింది.

యెన్నడో ఇరవై అయిదేండ్ల సంగతి... గప్పుడే మీసాలు నల్లగయితున్నయి.

బాపుకి సోరియాసిస్, సూపియ్యని తావు లేదు, మింగిపించని మందు లేదు. ఫలానా తాన ఫలానా డాక్టరంటే ఉరుకుడు...ఫలానా తాన ఫలానా మందంటే ఉరుకుడు. యేడా గుణం కనపడలే.

నవాబ్ ప్యాటకి పది కిలోమీటర్ల దూరంల, మరికల్ కాడ, 'కల్మకల్లు' అనే ఊర్ల 'సాకలి బాలయ్య' మందిస్తే ఎసోంటి రోగమైనా మాయం గావల్సిందేనని తెలిసింది. రెండు మూడు సార్లు నేనే పొయ్యి మందు తెచ్చిన. కొంచం నయమనిపించింది. పత్యమేమో కటోరం. బాపు కాబట్టి తట్టుకున్నడు గాని, ఇంకోకడూ ఇంకొకడూ అయితే అంతే... మోసేటోనికే మోసినన్ని బరువులు, తట్టుకునేటోనికే తగినన్ని కష్టాలు.

గట్లనే ఓ అయితారం మందుకని ఎల్న, 'కల్మకల్' కి గది గిదీ అని బస్టాండుకి ఒచ్చేటప్పటికి అంబటేలయింది. అప్పట్ల మహబూబ్ నగర్కి

బస్సుల నాల్గయిదు గంటలు పడుతుండె. ఆడికెల్లి నవాబ్ ప్యాట పదిహేను కిలోమీటర్లు.

బస్సుదిగి బస్సెక్కి నవాబ్ ప్యాటకు ఒచ్చేటాల్లకి అయిదయింది.

మొగులు నల్లగయ్యింది. ఇంక జర సేపట్ల ఆనొచ్చేటట్టుంది. గద్దలన్ని కిందికి దిగినయి. దూల్లు కొట్టాలల్లకి పోనీకె జల్ది జల్ది నడుస్తున్నయి.

అట్లకెల్లి పోతున్న స్కూటరాయినను లిఫ్టడిగి మరికల్ చేరెట్యాల్లకు ఆరు. కల్మకల్ ఇంకా రెండు కిలోమీటర్లు. జల్ది జల్ది నడుసుడు షురు జేసిన. సల్లగ గాలి కొడ్తున్నది... యాడ్నించో తడిసిన మన్ను వాసన మోసుకొని.

'కల్మకల్'ల అడుగుపెట్టేసరికి దీపాలు గూట్ల వెట్టింల్రు. గాలి తక్వయ్యింది. సక్కగ 'సాకలి బాలయ్య' ఇంటి తోవ బట్టిన. రెండు మోదుగాకు దొప్పల కట్టిన మందిచ్చిండు. కీసలకెల్లి వరకు దీసి పైలంగ వెట్టుకున్న. ముచ్చటడిగిండు చెప్పిన. బాపు ఇచ్చిన పైసలు ఆయన సేతుల్ల వెట్టి, చెంబెడు నీల్లు తాగి, సినుకులు మొదలైనయి, గియ్యాలట్కి గీడ్నే పండుకొని, తెల్లారి పొమ్మన్నా సాకలి బాలయ్య మాట ఇనకుండ, ఒచ్చిన తోవ పట్టిన.

ఊరు దాటి చౌరస్తకు ఒచ్చేటాల్లకు ఆన ఊటగయ్యింది. ఏడు దాటినట్టుంది. సిమ్మ సీకటి. నెత్తి దాపుకోనీకె ఒక్క చెట్టూ లేకపాయె. చౌరస్తల బాట పక్కకు ఒక గుడిసెలకెల్లి సిన్న ఎలుతురు కనవడ్డది. అటుదిక్కు ఉరికిన, మందు తడ్వకుండ, చేతులు అడ్డం పెట్టుకుంట లోపటికి ఆడుగేసిన.

తుంగ గడ్డితోటి కప్పిన కొట్టమసోంటి గుడిసె. ఓ మూలకు పొయ్యి, దానికానుకుని రెండు మూడు సత్తుగిన్నెలు, సీసల బిస్కెట్లు. ఇట్లకెల్లి ఒక బెంచి. చాయ దుక్నం లెక్కున్నది.

పొయ్యికి పక్క పొంటి, అటుదిక్కు మొఖము చేశ్న ముసల్ది. నా సప్పుడుకి ఇటు మల్లింది. నా సంగతి జెప్పి, ఆనెల్సినంక పోతనన్న.

ముసల్ది ఇన్నది, "ఇంక రెండు మూడు గంటల దాంక ఆన ఎల్వదు, బస్సు లేదు, నవాబ్ ప్యాట దాంక సీకట్ల అడుగుదీసి అడుగేసేటందుకు గాదు, గట్లనే నిన్న మొన్న కురిసిన ఆనలకి పెద్ద చెర్వు అలుగు పారుతుంది. తొవ్వతెల్వదు" అంటున్న ముసల్దాని మాటలకు నేను సప్పుడు జెయ్యలె.

గామె సూపిచ్చిన బెంచి మీన కూసుంట, ఆయిన్త అవతల దిక్కు తడిక సప్పుడయితే చూస్న.

బయటికి పోయినట్టుంది. తడికని జరుపుకుని, లోపట్కి ఒచ్చుకుంట నన్ను సూసింది. గట్లనే చేష్టలుడిగి నన్ను సూస్తున్న గామెని సూస్కుంట బెంచి మీద కూలవడ్డ.

సరిగ్గ పదహారేండ్లుంటయి ఆ పిల్లకి. పొట్టి సేతుల పొడుగు జాకెట్టు. మడిమెల దాంక లంగా. మిరపపండు రంగు జాకెట్టు కింద ఆకుపచ్చ లంగా... అంచేమో మల్ల గదే ఎరుపు. నా కండ్లల్ల మెరుపు.

'నా కొడుకు బిడ్డె సీత' సెప్పింది ముసల్ది.

చామనచాయకి ఇంక జరంత నల్లరంగెయ్యొచ్చు. ముక్కు మొకం అన్ని మామూలుగనే ఉన్నయి. కానీ...కానీ... కండ్లు.

గా కండ్లు.

గట్లని పెద్దవి కావు... చిన్నవీ కావు. గానీ...

తడికను జరుపుకుంట నా దిక్కు చూసిన ఆ కండ్లు కురిపిస్తున్న సల్లని సూపులు, అమృతపు వాకిల్లు.

ఆ ముసల్ది అడుగుతున్న ప్రశ్నలకి జవాబిచ్చుకుంట, నా కండ్లతోటి ఆ కండ్లల్ల దాక్కున్న రహస్యమేందో దొరికిచ్చుకుందామని దాంట్లెనే సూస్కుంట గూసున్న.

చాయ జెయ్యనీకె పాలు లేవని జరంత డికాషన్ చేసిచ్చింది. సిన్న తప్కుల నాల్గు బిస్కెట్లు పెట్టిచ్చి, తిననీకె ఇగ ఇంత కంటేమి లేవు మా తాన అన్నట్టు సూసింది. మొత్తం దిన్న.

ఆన ఇడ్వకుండ గొడ్తనే ఉన్నది.

ఆమె, ఆ ముసల్ది చెరో రొట్టె తిన్నరు. తింటున్నంత సేపూ ఆ ముసల్ది ఏదో ఒకటి అడుగుతనే ఉన్నది... చెప్తనే ఉన్న. గా నాలుగ్గిన్నెలూ గాడ్నే తోమి సర్దింది గామె.

నేను గామెని సూస్తున్న సంగతి, ఆమె గూడ సూసింది. సూపులు మారుతున్నయి కానీ... నా దేవులాటకి అర్థం తెల్వలె. గా కండ్లల్ల యేదో రహస్యం మాత్రం ఉంది. గదేందో తెలుస్తలేదు.

గాడ్నే ఈతసాప పర్సుకుని పండుకున్నది ముసల్ది, మాట్లాడుకుంటనే. 'పొద్దున్నే ఏడింటికి మరికల్ కాడికెల్లి బస్సుందని చెప్పుకుంటనే నిద్ర బొయ్యింది.

ఆమె నా దిక్కు సూసి, సూరుల సుట్టి పెట్టిన రెండు గోనె బస్తలను తీసిచ్చి, గా ముసల్దాని పక్కకు పండుకున్నది. గాసిన్న గుడిశెల్నే, గాల్ల నెత్తికాడ ఒక బస్త పరుసుకుని, ఇంకొక బస్త మెత్తలెక్క మడతవెట్టి నెత్తి కింద పెట్టుకుని పండుకున్న.

కండ్లు మూస్కొని పండుకున్నా... గా కండ్లు నా ఎంకనే బడ్డయి. అటుఇటు పొర్లిన కానీ..ఏందో తక్వయినట్టు... చెయిన్ పడ్తలేదు. లేసి గూసొని గామె దిక్కు సూస్న.

అప్పట్కే గామె లేసి నా దిక్కు సూస్తున్నది.

గా సీకట్ల..గా ఎక్క ఎలుగుల...కండ్లూ కండ్లూ గలిసినయి.

యాడ్నో మెరుపు మెరిసింది. జరయినంక ఉరుమురిమింది. గా మెరుపుల మల్ల చూశ్న గా కండ్లని.

నువ్వొద్దె... ఏం కండ్లవి.

రవివర్మ ఎంతటి దురదృష్టవంతుడో తెల్సిపోయింది. దీపపు కాంతుల తోటి కాంతని సృష్టించినాయన, గీ యవంత కండ్లను సూసి ఏకాంతంల ఇంక జరంత ఎవ్వసేపు పట్టినా మిణుగురులు వెలుగులనుదింపేటోడు.

గీడ భాగ్యమతిది మాత్రం జరంత అదృష్టమే. గీమే మీద సూపుబడినంక...గీ సీత కండ్లని సూశ్నంక ఏ సుల్తానైనా గులాముగావల్సిందే. భాగ్యమతి భాగ్యము భాగ్యనగరమైంది గాని లేకపోతే గీ హైదరాబాద్ కి "సీతా నగరం" అని సచ్చినట్టు ఒస్తుండె.

నువ్వొద్దె... ఏం కండ్లవి

ఆనెల్సింది. నేను గుడిశెలకెల్లి బయటికొచ్చిన. ఎంకనే సీత. మొగులు

ఇచ్చు కుంటున్నది. మెల్లగ... సల్లగ గాలొస్తున్నది.

గామె కండ్లల్లకి సూశ్న.

సీత కండ్లు నవ్వినయి.

లోపట్కిపొయ్యి బెంచి తీసుకొచ్చి అకిట్టేసి, గామె గూసొని, నన్ను గూసోమని సూసింది. గప్పుడు మతిలకొచ్చింది, గింత సేప్పట్నించి గామెని స్తూన్ననే ఉన్నా! గామె గింత దాంక ఒక్కమాట నోరుతెరిసి మాట్లాడలేదని.

బెంచీ మీద గూసుంట నా పేరు శెప్పిన. నా పేరుని ముచ్చటగ పలికింది. ఇగ గాడ మొదలైనయి సీత మాటలు గండ్లు తెగుడు.

గండ్లు తెగి ఊరంత ఏరైనట్లు, సీత మాటల ప్రవాహానికి తడిసి ముద్దనైన.

గౌండ్ల పోచయ్య సిన్న కోడలు కళావతి, ఖాసిం మామ రెండో కూతురు

జరీనాబీ, కాపోల్ల అనసూయ, అమనగంటి అలివేలూ, కమ్మరి శేషయ్య, నడిపి బుజ్జీ, సీత, గీల్లందరిది ఒకటే సోపతి.

లంగాలు మోకాల్దాంక మీదికి గుంజి, గోసి కట్టి సిట్టేపు బాయిల ఈదులాటలు, పంతులు బాయికాడి మల్లమ్మ మామిడి రుచులు, పోకబంతి దండలు, గచ్చకాయలు, బతుకమ్మలు, నేరెడు పండ్లు, సొరబాయి జామ చెట్టు, వగరు పసిరి కాయలు, అష్ట చెమ్మలు, మలెంద బాయిల రూపాయి సిక్క కోసం మునుగుడూ, వనగుంతలు, కాల్చిన సితవలపండ్లూ...

సిన్నప్పట్నించి, గియ్యాల్టిదాంక జరిగినయన్ని... పూసగుచ్చినట్టు, నా ముందల పరిసింది సీత.

ఓ మబ్బు సాటున దాక్కొని, 'నా ఎన్నెల ఎలుగుల కన్న ఎక్వ వెలుగు యాడ్కెల్లొచ్చింది' అని సీత కండ్లని సూసి, సిగ్గు వడి మబ్బు సాటుకు దాక్కున్నడు సంద్రుడు.

గా నడిరాత్రి...సల్లటేల, సీత కండ్ల రహస్యం ఎరుకయింది. మొలాజులేదు అవి అందమైన కండ్లే! ఎలుగులనిచ్చేటివే!! సల్లని సూపులే!!! గానీ... ఇవ్వన్నింటికంటే 'సొచ్చమైనవి' గా కండ్లు. ఏ కల్మశం ఎరుగని, నిఖార్సయిన నిజమైన 'స్వచ్ఛమైన' కండ్లవి.

సీత మాటలు, జోలపాటలైనట్టు, నాకు ఎప్పుడు నిద్ర వట్టిందో దెల్వలే. ముసల్ది లేపేసరికి, లేసి గూసున్న. తెల్లారింది. బస్సొచ్చే యాలైందని చెప్పింది. సీత చాయి చేస్తున్నది. నేను గామె దిక్కు సూసుడు సూసి, బెంచి దిక్కు సూపెట్టింది కండ్లతోని.

యాప్పుల్ల, చెంబుల నీళ్ళు బెట్టున్నయి. పండ్లు తోముకుని, మొకం కడుక్కున్న. సీత చాయిచ్చేటప్పుడు గామె కండ్లల్లకి సూశ్న. జరంత పరేషాను గున్నయి గా కండ్లు. ఎంత ఆప్యాయత సూపెట్టింది నామీద. నాకు ఆమెకు ఏ సంబంధం లేకపోయినా ఏదో దగ్గరితనం అల్లుకున్నట్టయ్యింది. మాటలతోటే మనుసులు ఇంత జల్దిన గింత కల్సిపోతరని గియ్యాలే సమజయ్యింది.

ఛాయ గ్లాసు సీతకిచ్చి, ముసల్దానికి జరన్ని పైసలిచ్చి, బాపు మందుల పొట్లం తీస్కుని బయటికొచ్చుకుంట, సీత దిక్కు సూశ్న.

సీత కండ్లు నిండు కుండలయినయి.

మల్లొస్తనని, కండ్లతోటి బరోసా ఇచ్చి ముందటికి నడిసిన. గుడిశె ముందల నిలవడి నన్ను సూస్తున్న ఇసయం నాకు తెలుస్తనే ఉంది. ఎంకకి దిరిగి సూశే ధైర్యం జెయ్యలె. సీత సూపులు ఆనినంత నెరవు, ఆమె సూపులు నా ఈపుకి గుచ్చుకుంటనే ఉన్నయి.

మహబూబ్‌నగర్ బస్టాండు దాట్నంక కుడిచెయ్యి దిక్కు తిప్పిన కారుని. రెండు మూడు మలుపులు తిరిగినంక నవాబ్ ప్యాట రోడ్డు పట్టిన.

బాపు పెయ్యి దెబ్బతిన్నంక మల్ల గీ ఊరికొచ్చే వొంక దొరకలే. సదువులు, బరువులు మోసుకుంట, గీ ఉరుకుల పరుగుల జిందగీల బడి మునిగి తేలుకుంట, ఏడకి పోతున్నామో, ఏడ తేలుతున్నమో తెల్వకుంట ఇన్నేండ్లు అయిపోయినయి.

మల్ల గిన్నేండ్లకి... ఒక్కపాలి... ఆమెని.... గా 'కండ్ల'ని సూడాలని పించింది.

నువ్వొద్దె...ఏం కండ్లవి.

స్వచ్ఛతకి మారు రూపాలు.

నవాబ్ ప్యాట బురుజు దాటి ఎడమచెయ్యి దిక్కు తిరిగి పోవట్టింది కారు. మొత్తం మారి పోయింది ఊరు. కాలం తీర్గ అంత మారాల్నేమో?

సెరువుగట్టు దాటి, మరికల్ ఉర్లేకెళ్ళి 'కల్మకల్' దిక్కు తిప్పిన కారుని. జరంత దూరం పొయ్యింది బండి... గప్పుడే ఒక ఆలోచన దిమాకుల పుట్టి.. ఎన్నులకి జారి, దడ పుట్టిచ్చింది.

టప్పున బండాపిన.

సీత, గాడ్నే...పిల్లజెల్లతోటి ఉంటే నేనేం జెయ్యాలె?

లేకపోతే!? ఏం జెయ్యాలె?

సరే... ఒకేల నిజంగనే గామె నా కోసం ఎదుర్సూసుకుంట ఉంటే? నేనేం జెయ్యాలె?

గిసొంటప్పుడు... గామె ఎట్లున్నా నేను, మనిషిని అయితనా?

నా కంత హిమ్మతుందా?

నేనేమన్నా చెయ్యగల్గుతనా?

నా ఊహల్లైనా, కలల్లైనా గా కండ్ల స్వచ్ఛతను కలకాలం కాపాడుకోవాల్నని, రూంజిగ కారుని ఎంకకి తిప్పిన.

రచయిత సెల్ : 9246565824

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి. మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

నిర్ణయాలపై నిలబడతారా?

కొత్త సంవత్సరం వచ్చి నాలుగురోజులవుతుంది. ఉత్సాహంగా తీసుకున్న నిర్ణయాలపై నిలబడ్డారా? మరల నిర్ణయాల్ని వాయిదాలు వేశారా? వాయిదాల పద్ధతి సరికాదని గుర్తించండి. ముఖ్యంగా కొన్ని నిర్ణయాలు కచ్చితంగా అమలు చేయడం మీ ఆరోగ్యానికీ, మీ కెరీర్‌కి, మొత్తంగా మీ జీవితానికి మంచిది.

◆ ఆఫీసులో గానీ, ఇంట్లోగానీ ఎక్కువసేపు సోషల్ మీడియా సైట్ల మీద కాలం గడపకండి. రాత్రిళ్ళు ఇంటికి వచ్చాక ఫేస్‌బుక్, ట్విట్టర్ల వంటి సైట్ల మీద ఎక్కువసేపు గడుపుతున్నారు. ఇది అంత శ్రేయస్కరం కాదు. గంటలు గంటలు సోషల్ మీడియా సైట్లపై కాలాన్ని వెచ్చించడం తగదు.

◆ ఆహార నియమాలకు సంబంధించిన నిర్ణయాల్ని అమలు చేయండి. రాత్రి ఎనిమిది గంటలకు ముందే డిన్నర్ ముగించండి. మీరు నలభైలు దాటినవారయితే మీ ఫ్యామిలీ డాక్టర్ సలహాతో ఆహారాన్ని మార్చండి.

◆ బరువు తగ్గాలన్న నిర్ణయాన్ని వాయిదా వద్దు. తగ్గడానికి అవసరమైన అన్ని పనులు చేయాలి. తగిన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పక వ్యాయామం చేయడం అవసరం. ఈ నిర్ణయం తప్పనిసరిగా అమలు చేయండి.

◆ వారానికి ఒక్క పుస్తకమైనా చదవండి. మీకు ఇష్టమైన పుస్తకాల్ని చదవండి. మీకు బాగా నచ్చిన పుస్తకాల్ని పక్కన

పెట్టుకోండి. వాటిని ఒక్కొక్కటిగా చదవడం మొదలెట్టండి.

◆ ఆరోగ్యానికి సంబంధించిన రుగ్మతల విషయంలో నిర్లక్ష్యం వద్దు. డాక్టర్‌తో చెకప్ చేయించుకోవాలన్న నిర్ణయంపై నిలబడండి.

◆ వేతనంలో అయిదు లేదా పది శాతం పిల్లల కోసం పొదుపు చేయాలన్న నిర్ణయాన్ని కూడా వదిలేయకండి. ఖర్చులకు అంతు ఉండదు. కనుక ముందుగానే మీరు నిర్దేశించుకున్న మొత్తాన్ని పిల్లల పేరుతో ఉన్న సేవింగ్ ఎకౌంట్స్‌కు బదిలీ అయ్యేలా చూసుకోండి.

ఇలాంటి నిర్ణయాలపై నిలబడి అమలు చేస్తేనే మీపై మీకు, మీ మీద కుటుంబ సభ్యులకు నమ్మకం ఏర్పడుతుంది.

స్నేహాలు పరిచయాలుగా మారుతున్నాయా?

ఒకదశలో రోజు కలుసుకునే మిత్రులు పనుల ఒత్తిడి వల్ల ముఖాలు చూసుకోవడమే అరుదవుతుంది. ఒకే నగరంలో ఉన్నప్పటికీ మిత్రుల్ని కలుసుకోలేరు. వారి మధ్యన ఉన్న స్నేహం కాస్త పరిచయం స్థాయికి జారిపోతుంది.

◆ పనుల బిజీలో కలుందాం అనుకుంటూనే సంవత్సరాలు గడిచిపోతుంటాయి. కాలేజీరోజుల్లోనో, ఒకే ఆఫీసులో కలసి పనిచేసిన రోజుల్లోనో ఉండేటువంటి దగ్గరితనం క్రమంగా ఆవిరయిపోతుంది.

◆ అవసరమయితే తప్ప కలవని ధోరణి ప్రమాదకరం. ఒకటీ రెండేళ్ళు కాదు, ఏడాది రెండేళ్ళయినా ఒకే ఊళ్ళో వున్నవారిని కలవకపోతే ఎలా అన్నది ఆలోచించండి. ఒకప్పుడు చాలా ఆత్మీయమిత్రుడిగా వున్న వ్యక్తి కొన్నేళ్ళ తర్వాత కలిస్తే మాటలే కరువయిపోతాయి. కేవల పరిచయస్థుల్లా మాట్లాడుకోవాల్సి వస్తుంది.

◆ కాలేజీ రోజుల్లో గంటలు గంటలు కలిసి గడిపిన స్నేహితుల్ని అప్పుడప్పుడు కలవకపోతే, పలకరించకపోతే ఆ స్నేహతత్వత మరుగునపడుతుంది. అందుకని మనుషుల్ని కలవాలి, పలకరించాలి.

◆ మీ పాతస్నేహితుల జాబితాని ఒక కాగితం మీద రాసుకోండి. వారికి ఫోను చేసి పలకరించండి. మరో వారం తర్వాత ఇద్దరికీ వీలయిన సమయంలో కలసి కప్పు కాఫీ తాగి అరగంట గడపండి. మరల స్నేహం మొగ్గ తొడుగుతుంది. ఈరకంగా పాతమిత్రుల్ని కలవడమనే కార్యక్రమం ఈ కొత్త సంవత్సరంలో మొదలు పెట్టండి.

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయొచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహ పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా:
మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక
ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-20

నెమలీక

గంటలోనే పరుగు

– జిరాఫీ గుర్రం, గాడిద జాతికి చెందినది.
– అన్ని జీబ్రాల శరీరం మీద ఉండే గీతలు తెలుపు, నలుపు రంగులోనే ఉంటాయి.
– జీబ్రాలలో ప్లెయిన్ జీబ్రా, గ్రెవీ జీబ్రా, మౌంటెన్ జీబ్రా అనిమూడు రకాలున్నాయి.
– చూడ్డానికి అన్ని జీబ్రాల మీద వుండే గీతలు ఒకేలా కనిపిస్తాయి కానీ ఒక దానిమీద వుండే గీతలు మరో జీబ్రా శరీరం మీది గీతలకు పోలిక ఉండదు.
– కొన్ని జీబ్రాలు తెలుపు మీద నలుపు చారలు ఉన్నట్లు కనిపిస్తే, మరికొన్ని జీబ్రాలు నలుపు మీద తెలుపు చారలున్నట్లు భ్రమ కలిగిస్తాయి.
– ఇవి ఎక్కువగా ఆఫ్రికాలో జీవిస్తాయి.
– సాధారణ జీబ్రా తోక 18 ఇంచులు (అరమీటరు) పొడవు వుంటుంది.
– జీబ్రాకి వినికిడి శక్తి, కంటిచూపు చాలా ఎక్కువ.
– ఇది నిద్రపోయేటప్పుడు కూడా నిలబడే ఉంటుంది.
– దీని ఆహారంలో అధికభాగం గడ్డే ఉంటుంది.
– జీబ్రా చెవుల ఆకారాలను బట్టి వాటి భావాలెలా ఉంటాయో చెప్పొచ్చు. ఉదాహరణకు దానికి బాగా కోపం వచ్చినప్పుడు చెవులు బాగా వెనక్కి వంగి వుంటాయి.
– ఇది నీళ్ళు తాగకుండా ఐదు రోజులు జీవించగలదు. నీళ్లు మాత్రమే తాగి మైళ్ళకొద్దీ దూరం నడవగలదు.
– ఇది గంటకు 40 మైళ్ళ వేగంతో పరిగెత్తుతుంది. అప్పుడే పుట్టిన బుల్లి జీబ్రా కూడా ఓ గంట సేపట్లోనే పరుగెత్తుతుంది.
–దీని జీవితకాలం 28 సంవత్సరాలు.





ఆ ఒక్కటి...

ఇక్కడున్న తొమ్మిది బొమ్మల్లో ఒకటి మిగతా వాటికి భిన్నంగా ఉంది. అది ఏదో గుర్తించండి.

పేర్లేంటో..

కనిపిస్తున్న బొమ్మలన్నీ ఆంగ్ల అక్షరం 'C'తో మొదలవుతాయి. వాటి పేర్లు రాయండి.

రింగు రింగు బిళ్ళ

రింగు రింగు బిళ్ళ – రూపాయి దండ
దండ కాదురా – తామర మొగ్గ
మొగ్గ కాదురా – మోదుగ నీడ
నీడ కాదురా – నిమ్మల బావి
బావి కాదురా – బచ్చలి కూర
కూర కాదురా – మేదర సిబ్బి
సిబ్బి కాదురా – చీపురు కట్ట
కట్ట కాదురా – కావడి బద్ద
బద్ద కాదురా – బారెడు మీసం
మీసం కాదురా – మిరాయల పొడుం
పొడుం కాదురా – పోకిరి బావ

రంగులతో అందంగా

ఏ దారి?

చిన్నూ వాళ్ళ ఇంటి నుండి ఏ దారిలో స్కూలుకి వెళ్తున్నాడో చెప్పగలరా?

ఇంగిత జ్ఞానం

శుక ప్రియుడికి ఒక కోతంటే మహా ఇష్టం. దాన్ని అంత:పురంలోనూ, అంతరంగిక మందిరంలోనూ తన వెంటే ఉంచుకునేవాడు. మహారాణి ప్రభావతి దాన్ని వెలుపలే ఉంచమని కోరేది. కానీ వినేవాడు కాదు. అది పక్కవాళ్లను బెదిరించడం, మీదకు దూకి అల్లరి చేయడం చూసి ఆనందపడేవాడు.

అది చంచల స్వభావి. దాన్నలా వెంట తిప్పుకోవడం వలన మహారాజు గౌరవం దిగజారి పోతుందని మంత్రి సుధీరుడు కూడా చెప్పి చూశాడు. ఊహూ... వినలేదు.

ఒకసారి కోతిని తన వెనకే కూర్చోబెట్టుకుని ఎప్పటిలాగే గుర్రం మీద ఒంటరిగా అడవిలోకి వేటకు వెళ్ళాడు. జింకలు, కుందేళ్ళు కనిపించగా వాటిని తరుముతూ సంతోషపడ్డది. రాజు వాటిని వేటాడాడు. అడవి దున్నల మంద కనిపించగానే వాటి మీద ఎక్కి సవారీ చేసింది. దాని కొంటె చేష్టలు చూసి రాజు విరగబడి నవ్వుకోసాగాడు. తను కాస్త ముందుకు వెళ్ళాడు. అప్పుడు వినపడ్డది గాండ్రుమనే పులి అరుపు. ఇంకేముంది భయంతో వచ్చి రాజు వెనకాలే నక్కింది కోతి. రాజు బాణం సంధించి పులి కోసం ఎదురు చూడసాగాడు. ఇంతలో పులి పొదలోంచి వెలుపలకు వచ్చింది. బాణం దూసుకుపోయింది. కానీ పులి అమాంతం గాల్లోకి ఎగరడం వల్ల దానికి తగల్లేదు. పులి రెచ్చిపోయి కోపంతో మీదకు రాసాగింది. భయంతో కోతి గోలగోలగా అరుస్తూ, రాజును అమాంతం గుర్రం మీద నుంచి కిందకు తోసేసి, గభాల్న చెట్టుమీదకు చేరుకుంది. రాజు కింద పడిపోగా, గుర్రం కూడా భయంతో పరిగెత్తింది. పులి వేగంగా మీదకు రాసాగింది. ఇంతలో వేగంగా వచ్చిన బాణం పులి డొక్కలో తగిలింది. రెండు పల్టీలు కొట్టి ప్రాణాలు విడిచింది పులి. విల్లు, అమ్ములు పట్టుకుని వున్న కొండయ్య అక్కడికి వచ్చాడు. తన ప్రాణాలు కాపాడినందుకు రాజు ఆ కోయ యువకుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

"మీరు మహారాజులంటున్నారు. ఆపదలో ఎలా చిక్కుకున్నారు?" అనడిగాడు.

జరిగిందంతా చెప్పుకొచ్చాడు రాజు.

అప్పుడా యువకుడు పగలబడి నవ్వి "ఎవరైనా కుక్కను పెంచుకోగా చూశాను కానీ కోతని పెంచుకుంటారా? అది వన చరము. దానిది నిలకడ లేని స్వభావం. పైగా చాలా భయపడే జంతువు. ఇంకా నయం. నేను రాబట్టి సరిపోయింది. లేకుంటే పులికి ఆహారమైపోయేవారు" అన్నాడు.

అక్షరజ్ఞానం లేని, అడవిలో నివశించే మనిషికుండే ఇంగితజ్ఞానం తనకు లేనందుకు చాలా సిగ్గుపడ్డాడు.

ఆ తర్వాత పారిపోయిన గుర్రాన్ని వెతికి పట్టుకొచ్చాడు కొండయ్య గుర్రం ఎక్కిన రాజు వద్దకు.

కనిపించకుండా పారిపోయిన కోతి పరిగెత్తుకుంటూ వచ్చింది. కానీ కోతిని గుర్రం ఎక్కనీయలేదు. దాన్ని అక్కడే అడవిలో వదిలేసి ఇంటి దారి పట్టాడు. ఇంటికి వచ్చిన రాజు జరిగినదంతా పూసగుచ్చినట్లు మహారాణికి చెప్పాడు. ఇప్పటికైనా తన భర్త మారినందుకు చాలా ఆనందపడ్డది.

– పుప్పాల కృష్ణమూర్తి

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

పారిస్, 1848

తరువాతి రోజుల్లో రెండు వందల ప్రపంచ భాషల్లోకి అనువాదమయిన కమ్యూనిస్ట్ మానిఫెస్టోను, అది తొలిసారి ప్రచురితమయినప్పుడు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఇంచుమించు అందరూ దాన్ని విస్మరించారు. అప్పటికే యూరోప్ భగ్గుమంటోంది. 1848, ఫిబ్రవరి మూడోవారంలో, పారిస్‌లో రాజకీయ భూకంపం వచ్చిందన్న పుకార్లు బ్రసెల్స్‌లో వ్యాపించాయి. - నమ్మశక్యం కాని వదంతులవి. "అధికారం వదులుకుని, దేశం విడిచి వెళ్ళిపోయాడు లూయీ ఫిలిప్" ఫ్రాన్సులో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఫ్రాన్సు యిప్పుడు ప్రజాస్వామ్య దేశం!" గురువారం, ఇరవై నాల్గవ తేదీ నాడు పారిస్ నుండి రావలసిన రైలు కోసం నిరీక్షిస్తూ బ్రసెల్స్ రైల్వే స్టేషన్ జనంతో కిటకిటలాడింది. తను ఏ ప్రభుత్వానికి ప్రతినిధిగా ఉండాలో తెలుసుకోవటానికి, వార్తల కోసం, ఫ్రెంచి రాయబారి కూడా అక్కడికి వచ్చాడు. శుక్రవారం నాడు అర్ధరాత్రి తర్వాత పొగలు కక్కుతూ వచ్చింది రైలు. అదింకా ఆగకముందే "అంతటా ఎర్రజెండాలు ఎగురుతున్నాయి. రిపబ్లిక్‌గా ప్రకటించారు" అంటూ ప్లాట్‌ఫాం మీదికి దూకాడు డ్రైవర్. జనం ఒక్క పెట్టున 'ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ఆ నినాదాలు చేసిన వారిలో ఎక్కువ మంది జర్మనులే. ఫ్రెంచి రాయబారి భార్యతో సహా నెమ్మదిగా జారుకున్నాడు. త్వరలోనే, యూరోపియన్ రాజధానులన్నింటిలోనూ మార్మోగింది ప్రజాస్వామ్య నినాదం. ఒకప్పుడు అజేయమనుకున్న రాజరికాలు పేకమేడల్లా కూలిపోయాయి. పోనీ, వీళ్ళందరూ శత్రుదేశాలతో యుద్ధాలలో పరాజితులయినారా అంటే అద కాదు. సామాన్య ప్రజలు - కేవలం సంఖ్యాబలంతో దైవాంశ

జెన్నీకి ఎటూ పాలుపోలేదు. అరెస్టయిన జర్మన్‌ల పట్ల అధికారులు ఎలా ప్రవర్తిస్తున్నారో చూస్తూనే ఉంది. ఆయుధాలకు ఆర్థిక సహాయం చేశాడని నిరూపితమైతే దేశద్రోహ నేరం మోపవచ్చు.

సంభూతులైన తమ ప్రభువులను గద్దెదించారు.

ఒక చరిత్రకారుడు రాసినట్టుగా, "చరిత్ర సమస్యల్ని పరిష్కరించదు. వాటినది మందుపాతరల్లాగా దాడిపెడుతుంది." 1848లో యురోప్‌లోని పరిస్థితి ఇదే.

నెపోలియన్ విజయయాత్రల జ్ఞాపకాలు చెరిపేయటమే లక్ష్యంగా 1815లో యూరోప్ పునర్విభజన జరిగింది. కాని జనాభాలననుసరించి జరగలేదు. పైగా కొత్తగా పగ్గాలు చేపట్టిన ప్రభువులు బలహీనులు. ప్రజలకు పన్నుల భారం పెరిగింది. యుద్ధాలలో పాల్గొన్న సైనికులకు అదనపు లాభాలేమీ ఒనగూరలేదు. ఇదీగాక ప్రకృతి వైరీత్యాలు. పంటలు నాశనమైనా రైతులకు పరిహారం లభించలేదు. నిరుద్యోగ సమస్య పెరిగింది. ఇలాంటి అనేక ఇతర సమస్యలు కలిసి 1848లో సంభవించింది విస్ఫోటనం. యూరోపియన్ ప్రజానీకం, తమ పాలకులకు వ్యతిరేకంగా చేసిన తొలి తిరుగుబాటది.

ఈ విప్లవానికి కేంద్ర బిందువు పారిస్. ఒక రకంగా ఈ గొడవలు 1847 చివరలోనే ప్రారంభమయ్యాయి. మొదట స్విట్జర్లాండు, వేరు పడాలనుకున్న ఏడు ప్రాంతాలమీద యుద్ధం ప్రకటించింది. పక్కనే ఉన్న ఆస్ట్రియాలో చాన్సలర్ మెట్టర్‌నీష్ కూడా ఈ వేర్పాటువాద రాడికల్స్‌కు వ్యతిరేకంగా పావులు కదిపాడు. క్రమేణా స్విస్ తిరుగుబాటు (ఇటలీలోని) పాకెర్మోలో కొనసాగింది. 1848 జనవరిలో ఆహార కొరతతో సిసిలీలో అల్లర్లు చెలరేగాయి. అలా చిలికి చిలికి గాలివానగా మారి విప్లవం ఫ్రాన్సుకు చేరుకుంది. కాని అక్కడి లూయీ ఫిలిప్ మూర్ఖుడు "చలికాలంలోవెవ్వరూ విప్లవం చెయ్యరు. వేసవి కాలం దాకా ఆగుతారులే" అనుకున్నాడు.

ఒక సంవత్సర కాలంగా ఫ్రెంచి ప్రతిపక్ష సభ్యులు ఎన్నికల, రాజకీయ సంస్కరణల కోసం ఆందోళన చేస్తున్నారు. అప్పటికి ఓటు వెయ్యాలంటే 200 ఫ్రాంకులు ఓటింగ్ పన్ను కట్టాలి. దేశంలోని 'ధనిక' వృత్తి నిపుణుల ఆదాయం కూడా 600 ఫ్రాంకులకు మించదు. అంటే, 90 లక్షల పురుష ఓటర్లలో రెండున్నర లక్షల మంది మాత్రమే ఓటు వెయ్యగలరన్నమాట.

రాజకీయ సమావేశాల మీద ఉన్న నిషేధాన్ని అధిగమించటానికి (రాజకీయ చర్చల్లో ఆరు కన్నా ఎక్కువ మంది ఉండకూడదు) విందులు ఏర్పాటు చేశారు. ఇలాంటి తొలి విందులో 1200 మంది పాల్గొన్నారు. ఆ తర్వాత దేశమంతటా మరో 22 విందులు జరిగాయి. క్రమంగా 'రాజకీయాల్లో' రాడికల్ స్వరం బలపడింది. అప్పటికి ఎంగెల్స్, "దిగువ వర్గాల వాళ్ళు ప్రతిపక్షాలతో చేతులు కలపటానికి సిద్ధంగా ఉన్నారని" ఒక వ్యాసం ప్రచురించాడు. "రాజు గారు, బ్యాంకర్లకూ, స్టాక్ బ్రోకర్లకూ, రైల్వే పెట్టుబడిదార్లకూ, పెద్ద పారిశ్రామికవేత్తలకూ, ఖనిజ వ్యాపారస్తులకూ సేవకుడు."

ఫిబ్రవరి 22 నాడు పారిస్‌లో మరో విందు ఏర్పాటు చేశారు. రాజుగారు ఈ విందుల్ని అంత సీరియస్‌గా తీసుకోలేదుగాని ఆయన ప్రధానమంత్రి ఫ్రాంస్వా గైజో - ఇది విపత్పరిణామాలకు దారితీస్తుందని గ్రహించి దీనిమీద నిషేధం విధించాడు. కాని అప్పటికే అక్కడికి చేరిన జనం లొంగిపోవటానికి సిద్ధంగా లేరు. విపరీతమైన చలినీ, వర్షాన్నీ ధిక్కరించి వాళ్ళు "డౌన్ విత్ గైజో" అంటూ నినాదాలు చేశారు.

రోజు గడిచింది. మంచు వర్షం కురిసింది. మంచు సూదులుగా మారి జనాన్ని గాయపర్చింది. అయినా, జన సందోహం పెరిగిందే తప్ప తగ్గలేదు. చెదరగొట్టటానికి ఎనభైవేల మంది నేషనల్ గార్డ్ - సాయుధ పోలీసులు వచ్చారు. కాని వాళ్లకూ, నేషనల్ గార్డ్‌కూ రాజు మీద కోపంగానే ఉంది. తుపాకులు కిందికి దించి నిరసన కారులలో కలిసిపోయారు. హర్షధ్వానాలతో ప్రతిధ్వనించిందా సమావేశ ప్రాంగణం. 'గైజో ముర్దాబాద్' నినాదాలు మిన్నంటాయి.

లూయీ ఫిలిప్‌కు అలసటగా వున్నట్టుంది. గోల ఏమిటో అర్థం కాలేదు. గైజోను డిస్మిస్ చేశాడు. ఈ నిర్ణయం నిరసన కారుల్ని తృప్తిపరుస్తుందని కూడా ఆశించి వుంటాడు. కాని సాయంత్రం వరకు వీధుల్లో ఆందోళనకారుల సంఖ్య పెరిగింది. పోలీసు కాల్పుల్లో యాభై మంది (కొందరు ఎనభైమంది అన్నారు) మరణించారు. నిరసనకారులు మృతదేహాలను బళ్లలో ఊరేగించారు. ఆ దివ్విటీల వెలుగులో, ఇనుపచక్రాల చప్పుడు నగర నిశ్శబ్దాన్ని భగ్నం చేసింది. ఆ రాత్రి యింకెవ్వరూ నినాదాలు చేయలేదు. విప్లవగీతాలు గానం చెయ్యలేదు. కాని నిశ్శబ్దం భయానకం.

ఆ రాత్రి పారిస్‌లో ఎవరూ నిద్రపోలేదు. నిరసనకారులూ, రాజుగారు మాత్రం ఖచ్చితంగా నిద్రపోలేదని చెప్పవచ్చు. రాత్రంతా బారికేడ్లు కట్టారు. రోడ్ల మీద పరచిన పదిలక్షల రాళ్ళు పెకలించి, నాలుగు వేల చెట్లు నరికి, సైనిక దాడులను ఎదుర్కోవటానికి వ్యూహాత్మక నిర్మాణాలు చేపట్టారు. కాని ఉదయం వరకు, సైన్యం కూడా నిరసనకారులతో కలిసిపోయింది. ఫిబ్రవరి 24 నాడు లూయీ ఫిలిప్ స్వచ్ఛందంగా గద్దె దిగి ఇంగ్లండ్‌కు పారిపోయాడు. ఫ్రాన్సులో నెత్తుటేరులు పారించడం తనకిష్టం లేదని ఒక ప్రకటన కూడా విడుదల చేశాడు. అయితే,

వెళ్లేముందు తొమ్మిదేళ్ల తన మనవణ్ణి సింహాసనం మీద కూర్చోబెట్టాడు. ఇక అతడే ఫ్రాన్సుకు ప్రభువు కుర్రవాడికి మెజారిటీ వచ్చేదాకా తల్లి అతడి తరఫున పరిపాలిస్తుంది. కాని ఇలాంటి ప్రహసనాలకది సమయం కాదు. కుర్రవాడూ, తల్లి కూడా పలాయనం చిత్తగించారు. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది.

"ఈ తిరుగుబాటు రాజకీయపరమైంది కాదు. ఆకలి బాధలే దీనికి ప్రేరణ. కేవలం ప్రభుత్వాలు మారటంతో ఈ సమస్యలు తీరవు. క్రమంగా చట్టాలు మారతాయి. సమాజ స్వరూపమే మారుతుంది. అధికారాన్ని నిలబెట్టుకోలేని వాళ్ళు దాన్ని వదులుకోక తప్పదు" అన్నాడు ప్రముఖ ఫ్రెంచి చరిత్రకారుడు, రాజకీయ చతురుడు అలెక్స్ డియకులిల్

ఈ కొత్త ఫ్రెంచి ప్రభుత్వాన్ని అమెరికా వెంటనే గుర్తించింది. 1830 నాటి ఫ్రెంచి విప్లవంలో అధికారం చేపట్టిన లూయీ ఫిలిప్ ఇప్పటి విప్లవంలో దేశం వదిలి పారిపోయాడు.

పారిస్ విప్లవ వార్తలు బ్రసెల్స్ చేరటానికి వారం రోజుల ముందే అనూహ్య పరిణామాలేవో జరగబోతున్న హెచ్చరికలు వచ్చాయి. ఏం జరిగినా సిద్ధంగా ఉండాలన్నారు మిత్రులు. దేశం వదిలి వెళ్లటానికి బదులు ప్రస్తుతముంటున్న ఇంటి నుండి బోర్డింగ్ హౌజ్‌కు మారాడు మార్క్స్.

జనవరి 29నాడు, పారిస్‌లో ఎంగెల్స్ లేనిసమయంలో అతని అపార్ట్‌మెంట్‌లోకి బలవంతంగా ప్రవేశించిన ఫ్రెంచి పోలీసులు అతణ్ణి ఇరువై నాలుగు గంటల్లోగా ఫ్రాన్సు విడిచి వెళ్లాలన్నారు. లేని పక్షంలో బహిష్కరణ శిక్ష విధించి ప్రష్యాకు పంపిస్తారు.

పారిస్ విప్లవంతో మార్క్స్ ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. మార్క్స్, అతని స్నేహితులు అనేక వేల మందితో ఒక ప్రదర్శన...డెమానుస్ట్రేషన్‌కు పిలుపునిచ్చారు. సన్నాహాలు చురుగ్గా జరిగాయి.

ఆ రాత్రి ప్రదర్శనకు జనం బాగానే తరలివచ్చారు. 'మార్క్స్' గీతాలు ఆలపించారు. ' ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి ' అంటూ నినాదాలు చేశారు. సివిల్ పోలీసులు, ప్రదర్శనలను అదుపు చెయ్యడానికి ప్రయత్నించారు. జనంలో అలజడి ప్రారంభమైంది. "స్వేచ్ఛ, సమానత్వం" అన్న నినాదాలు మిన్నంటాయి. అంతలో పోలీసులు విరుచుకు పడ్డారు. కనిపించిన వాడినల్లా కిందపడేసి చావబాదారు. పారిపోతున్న వాళ్లను పట్టుకొని కసిదీరా కొట్టారు.

స్వదేశంలో అప్రతిష్టపాలైన జర్మనులే శనివారం రాత్రి జరిగిన హింసాకాండకు బాధ్యులని వదంతులు వ్యాపించాయి. (ఇలా వ్యాపింప చేయడం వెనుక, బెల్జియన్ రాజు లియొపాల్డ్ కుట్ర దాగి ఉంది)

"ఒక్క రోజులో బెల్జియన్ మధ్య తగాదాలు ప్రజలకు జర్మనులు శత్రువులుగా మారిపోయారు" అంటారు ఎంగెల్స్. పోలీసులు, సైన్యం, సివిల్‌గార్డ్ అందరూ జర్మన్‌లకు వ్యతిరేకం. జర్మన్‌లు ఆత్మరక్షణ కోసం ఆయుధాలు ధరించక తప్పలేదు. ఇందుకు గాను కార్ల్ ఆర్థిక సహాయం చేశాడు. (ఇంట్లో వారే వారసత్వంలో భాగంగా ఆయనకు కొంత డచ్చిచ్చారు అని రాసుకుంది జెన్నీ తన ఆత్మకథలో).

ఫిబ్రవరిలో, తల్లి ఆయనకు 6,000ఫ్రాంకులు పంపింది. ఇది తప్ప మార్క్స్ దంపతులకు వేరే ఆదాయం లేదు. తీర్చవలసిన అప్పులు చిట్టా పెద్దది. కాని స్వంత డబ్బులు ఖర్చుపెట్టాల్సివచ్చినప్పుడు మార్క్స్ భవిష్యత్తు అవసరాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఒక నిమిషంలో అతని చేతిలో వున్న డబ్బు మరుక్షణం మాయమవుతుంది. అనేక సార్లు డబ్బు వస్తుందనే ఆశతో ముందే ఖర్చులు చేస్తాడు. ఆరువేల ఫ్రాంకుల్ని ఇలా నీళ్లలా ఖర్చుపెట్టడమంటే ఏమిటో జెన్నీకి తెలుసు. ఇక రేపట్నించి మళ్లీ అప్పుల వాళ్ల అభద్రత. అయినా మార్క్స్ ఆ డబ్బులు కుటుంబానికి ఆహారంకోసం కాక, ఆయుధాల మీద ఖర్చుపెట్టినప్పుడు అభ్యంతరం చెప్పలేదు. ఇప్పటి దాకా సైద్ధాంతిక చర్చలకే పరిమితమైన మార్క్స్, ఇప్పుడు ఆచరణ వైపు అడుగువేశాడని ఆమె గుర్తించి ఉండదు.

మార్చి 1నాడు అప్పటికే అరెస్టయిన లూపస్ (విల్హెల్మ్ వూల్ఫ్, మార్క్స్‌కు అత్యంత సన్నిహితుడు), ఇతర జర్మన్‌లనూ బలవంతంగా ఫ్రాన్సుకు పంపించేశారు పోలీసులు. మార్క్స్‌కు కూడా ఇక ఎక్కువ సమయం లేదు. అతడు 2,100 ఫ్రాంకుల కరెన్సీ నోట్లు మారుస్తుండగా, ఒక గూఢాచారి గమనించాడు. అతడు ఈ డబ్బుతో తిరుగుబాటుదారులకు ఆయుధాలు కొంటున్నట్టు రుజువైతే శిక్ష ఖాయం. పిల్లల్ని తీసుకొని ట్రేయర్‌కు వెళ్లమని జెన్నీకి చెప్పాడు గాని ఆమె అంగీకరించలేదు. (ట్రేయర్‌లో "మార్క్స్ తల్లి"ని కూడా కొడుక్కి పంపిన డబ్బు గురించి అధికారులు ప్రశ్నించి, ఆ డబ్బు కుటుంబావసరాలకోసమే అని ఒక అఫిడవిట్ తీసుకున్నారు)

పారిస్‌కు దగ్గరగా ఉండాలని, కమ్యూనిస్ట్ కేంద్ర కార్యాలయాన్ని లండన్ నుండి బ్రసెల్స్‌కు మార్చారు. కాని మారిన పరిస్థితుల్లో అది పారిస్‌కు మారాలని సూచించాడు మార్క్స్. బహుశా తనుకూడా అక్కడికి వెళ్లాలని అప్పటికే నిశ్చయించుకొని ఉంటాడు. పారిస్ ప్రతిపక్షపత్రిక సంపాదకుడొకడు ఇప్పుడు తాత్కాలిక ప్రభుత్వంలో ఉన్నాడు. ఈ కొత్త 'అధికారిక' హోదాలో తన పాత మిత్రుడు మార్క్స్‌ని ఫ్రాన్స్‌కు తిరిగి రమ్మని ఆహ్వానించాడు. ఒక నియంత నిన్ను బహిష్కరించాడు. ఇప్పుడు మహోన్నత ఆశయాల కోసం కృషిచేస్తున్న నిన్నూ ఇతర ఉద్యమకారుల్నీ ఫ్రాన్సు రెండు చేతులా ఆహ్వానిస్తున్నది". సరైన సమయంలో మార్క్స్‌కు చేరిందీ ఆహ్వానం. మార్చి2 నాడు, మార్క్స్‌ను బహిష్కరిస్తూ లియోపాల్డ్ ఆదేశాలు జారీచేశాడు.

మార్చి3 నాడు బహిష్కరణ ఉత్తర్వులు మార్క్స్‌కు అందాయి. ఇరవైనాలుగంటల్లో దేశం విడిచి వెళ్లిపోవాలి. (ఈ భాష మార్క్స్‌కు అప్పటికే సుపరిచితం) అప్పటికి మూడేళ్లుగా బ్రసెల్స్‌లో ఉంటున్నారు. జెన్నీ, లెంచెన్ సామాను సర్దటంలో నిమగ్నమై ఉన్నప్పుడు, రెండవ అంతస్తులో ఉన్న గదిలో అయిదుగురు కమ్యూనిస్టు లీగ్ సభ్యులతో సమావేశం జరిపాడు మార్క్స్. లీగ్ కేంద్రకార్యాలయాన్ని పారిస్ మార్చటానికి, కొత్త పాలకమండలిని ఏర్పాటు చేయటానికి మార్క్స్‌కు అధికారమిస్తూ అంగీకారం కుదిరింది.

బోర్డింగ్ హౌస్ మీద పోలీసుల నిఘాకొనసాగింది. రాత్రి తొమ్మిది, పదకొండు గంటల మధ్య అనేక మంది వ్యక్తులు వచ్చివెళ్లారని గ్రహించారు. అర్థరాత్రి ఒంటిగంటకు రెయిడ్‌చేసి, మార్క్స్‌ను ధృవీకరణ పత్రాలు చూపించమన్నారు. ఫ్రాన్సు, బెల్జియంలు జారీచేసిన బహిష్కరణ ఉత్తర్వులు చూపించాడు మార్క్స్. కానీ పాస్‌పోర్ట్ లేదా ఇతర డాక్యుమెంట్లు లభించకపోవడంతో అరెస్టు చేసి పోలీసు వాహనంలోకి ఎక్కించారు.

జెన్నీకి ఎటూ పాలుపోలేదు. అరెస్టయిన జర్మన్‌ల పట్ల అధికారులు ఎలా ప్రవర్తిస్తున్నారో చూస్తూనే ఉంది. ఆయుధాలకు ఆర్థిక సహాయం చేశాడని నిరూపితమైతే దేశద్రోహ నేరం మోపవచ్చు. తమ బెల్జియన్ లాయర్ని ఎలాగైనా కార్ల్‌ను విడుదల చేయించమని అర్థించింది. ఆ తర్వాత ఆ అర్థరాత్రి చీకటి వీధుల్లో ఒంటరిగా ఇంటింటికీ తిరిగి మిత్రులను సహాయం చెయ్యమని కోరింది. చివరికి ఒక పోలీస్ సార్జెంట్ ఆమెను భర్త వద్దకు తీసుకెళతానన్నాడు.

లీగ్ సభ్యుడు ఫిలిప్ గిగో వెంట వచ్చాడు. తీరా పోలీస్ స్టేషన్‌కు వెళితే మార్క్స్ అక్కడ లేడు. పైగా లాయర్ సాయం ఎందుకు తీసుకున్నావని ఆమెను ప్రశ్నించారు. తన ధృవీకరణ పత్రాలు చూపించమన్నారు. పోలీసుల వైఖరిపట్ల నిరసన తెలిపిన గిగోను సెల్‌లో వేశారు. జెన్నీని అరెస్టుచేసి ముగ్గురు వేశ్యలున్న ఒక చీకటి సెల్‌లో నిర్బంధించారు

తెల్లవారి ఉదయం, తన సెల్ నుండి మిలటరీ ఎస్కార్ట్‌తో మార్క్స్‌ను మరోచోటికి తరలించడం గమనించింది జెన్నీ. అవే చివరి చూపులా ? చంపేస్తారా ? ఆందోళనతో మరో గంట గడిచింది. ఆ తర్వాత మేజిస్ట్రేట్ ముందామెను ప్రవేశపెట్టారు. అయితే ఎంత ప్రశ్నించినా,మార్క్స్ కార్యకలాపాల గురించి ఏమీ రాబట్టలేకపోయాడు మేజిస్ట్రేటు.

చివరికి, మధ్యాహ్నం మూడింటికి అంటే బహిష్కరణకు గడువు ముగుస్తుందనగా దంపతులిద్దర్నీ విడుదల చేశారు. (క్రితం రాత్రి సెల్‌లో ఒక ఉన్మాదితో కలసి ఉన్నానన్నాడు మార్క్స్). ఉన్న వస్తువులన్నీ అమ్ముకొని తన అతివిలువైన సిల్వర్‌ప్లేట్‌ను పుస్తకాల వ్యాపారి వాగ్లర్ వద్ద వదిలి బయల్దేరింది జెన్నీ.

వీడ్కోలు చెప్పటానికి పలువురు మిత్రులు కదలివచ్చారు. ఇప్పటికి జెన్నీ ఎన్ని ఇళ్లు మారిందో ! పెళ్లయిన తర్వాత ఇంత వరకు ఆమెకు సొంత ఇల్లంటూ లేదు.

మార్చి4 నాడు మార్క్స్, జెన్నీ, లెంచెన్ ముగ్గురు పిల్లల్తో బ్రసెల్స్ నుండి పారిస్‌కు బయల్దేరారు. "విప్లవ సూర్యుడు ఉదయిస్తున్నాడక్కడ" మేమక్కడికి వెళ్లక తప్పదు అంటూ ఆరోజుల్ని గుర్తుచేసుకుంది జెన్నీ.

(సశేషం)

భూమి లొటారం - గాలి పటాలం

జక్కులోడు పందిరికింద కుక్కిమంచంలో జారగిలబడి పైన ఎగిరే పిట్టల వంక చూస్తున్నాను. ఎండ పెటపెటలాడుతుంది.

ఆ పిట్టల బతుకు మధురం... వాటికి ఏ తిండీ తిప్పలు లేవు – ఓ మూలుగు మూలిగి లేచి ఒక బీడీ అంటిచ్చుకునేసరికి స్వామి ప్రత్యక్షమయ్యాడు.

స్వామి మసకబారిన చిరుగుల ప్యాంటు, పొడవాటి రంగు వెలసిన లాల్చీ, మొహం కనబడకుండా పెరిగిన గడ్డం, కండ్లు లోతుకు పీక్కుపోయినా అవి అందర్నీ లోతుగా చూస్తున్నాయి. స్వామి రాగానే 'దాహం' అని సైగ చేశాడు. జక్కులోడు మంచం పక్కనున్న చెంబు నీరు అందించాడు. స్వామి గటగట తాగి పక్కనే రాతి చప్టామీద కూలబడ్డాడు.

"అన్నా ఎవసాయం ఎట్లావుందే?" స్వామి అడిగాడు. జక్కులోడు మూలిగాడు.

"భూమిని నమ్మినవాడెవడూ చెడిపోడని గీతాకారుడు చెప్పాడు..."

స్వామి అట్లా వాగుతుంటే జక్కులోడి ఒళ్ళు భగభగ మండిపోతుంది. ఉన్నది రెండెకరాలు. బోరుబావి వుంది కానీ అసలు ఆయువు కరెంటు వుండదు. దానిష్టం దయ... అంతా చూసి అమ్ముకోడానికి పోతే మార్కెట్లో ఖర్చులు పోను మిగిలేవి అప్పులు. యాభైవేల లోనూ పెరిగే. దానికి వడ్డీ అయిదు!

"భూమిని నమ్మినవాడెవడూ చెడిపోలేదు – ఇది భగవతి సూక్తి"

జక్కులోడికి భూమండలం దద్దరిల్లేలా అరవాలనిపించింది. ఎవరిమీదనైనా పడి కరవాలనిపించింది. దిగమింగాడు.

".... నేను చెప్పేది నిజం. భూమిని నమ్ముకోమన్నాను గానీ.. అమ్ముకోవద్దన్నానా..."

జక్కులోడు బిత్తరపోయాడు.

"అంటే... ప్లాట్లు.. వెంచర్లు చేసి అమ్ముకుని కూడబెడితే పాయె.. ఆగు... నీభూమంటే అదొక్కటే కాదు, నీ చుట్టుపక్కల అసైన్డ్ భూములు.. ఫారెస్టు కమతాల మీదపడి అమ్మితా. ఎగబడి కొంటారు – రోజులు తిరిగే సరికి మిలియనీరైపోవచ్చు"

జక్కులోడు విశ్రాంతిగా నోరు కప్పలా తెరిచి వింటున్నాడు.

"దీనిక్కాస్త బుద్ధిబలం... కండబలం వుండాలె. పంచెలు గట్టి లంచాలు గుమ్మరించితే చాలు... ఇప్పుడు అర్థాంతరం మిలియనీర్ల జాబితా అట్లా పెరిగిపోతుంది."

స్వామి ....రనగా జక్కులోడి కట్టలోంచి ఒక బీడీలాగి అంటించాడు.

"నిజమే స్వామి... చెరువుశివారు... బంజరు భూములు.. దేవుడి మాన్యాలు అపార్టుమెంట్లయి పోయినై. మరి నేనేమో భూములు దానిమీద పడలే...

"పిచ్చోడా భూమి అపార సంపద... భూమి లోపలి పొరల్లోనికి వెళ్ళిపో. కాస్త సందు దొరికితే గ్రానైటు, హెమటైటు, గోలమైటు... క్వారీలే క్వారీలు. లారీలే లారీలు"

జక్కులోడి బుర్ర గిరగిరా తిరిగిపోతంది.

"నిజమే.. గనులు.. అపార సంపద.. విదేశీ మార్కెట్టు, బంగారు సింహాసనాలు... రాయల నాటి సంపద, రాచ భోగాలు, మంత్రి పదవులు.. జక్కులోడు ఆ ఎండలో మెత్తబడి మధురంగా మూలిగాడు.

".... నేను చెప్పేది నిజం. భూమిని నమ్ముకోమన్నాను గానీ.. అమ్ముకోవద్దన్నానా..."

"దీనిక్కాస్త బుద్ధిబలం... కండబలం వుండాలె. పంచెలు గట్టి లంచాలు గుమ్మరించితే చాలు... ఇప్పుడు అర్థాంతరం మిలియనీర్ల జాబితా అట్లా పెరిగిపోతుంది. అవీ ఇవీ ఏవీ వీలుగాకపోతే తెలివిగా గాలినీ... ఆకాశాన్నీ నమ్ముకో... అమ్ముకో..."

"పిచ్చోడా.. భూమ్మీద గుట్టలున్నాయి, కొండలున్నాయి, తీగలు కోపించి దండుకో, కొండమీద గుడుందనీ, దేవుడనీ బెదరకు, పని అయినాక దేవుడి హుండీలుంటాయి. వాటంగా కానుకలు గుప్పు."

తత్వం తలకెక్కిన వాడిలా జక్కులోడు వూగిపోతున్నాడు. స్వామి మరో బీడీ వెలిగించాడు.

"విన్నావేరా బేటా. అవీ ఇవీ ఏవీ వీలుగాకపోతే తెలివిగా గాలినీ... ఆకాశాన్నీ నమ్ముకో... అమ్ముకో..."

"అదెట్టా?" ... పై గుండెలు గుబగుబలాడుతూ అడిగాడు.

".... తరంగాలు, అయస్కాంత తరంగాలు... టెలిఫోను.. టీవీ తరంగాలు. టప్పున పట్టెయ్యాలి. ఎవనికో ఒకనికి కట్టబెట్టెయ్. లక్షా డెబ్బయ్ ఆరు కోట్లు, 2 జి స్పెక్ట్రమ్... లైసెన్సులు.. డబ్బే డబ్బు..."

"వామ్మో!" గుండెలు బాదుకుంటూ జక్కులోడు విరుచుకు పడబోతే స్వామి ఆపాడు.

"చిన్న డేంజరుంది. అది గానీ బయటపడి రచ్చరచ్చయితే ఖతం. కొందరు మంత్రులు, ఎం.పీలు, ఊచలు... ఒకటీ... రెండూ... మూడూ..."

ఇప్పుడు జక్కులోడు నిజంగానే మూర్ఛపోయాడు.

– రుక్మిణి

■ వికాసం

చిరాకులు, చిర్రుబుర్రులొద్దు...

ఓ వ్యక్తి పరిపూర్ణమైన జీవితం గడపడానికి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆనందం కూడా చాలా ముఖ్యం. ఈనాటి జీవన విధానంలో ఈ రెండూ అందడం లేదు. శారీరక ఆరోగ్యం ఒక వయసు వచ్చిన తర్వాత మాత్రమే బాధపెడతుంది. కానీ మానసిక ఆరోగ్యానికి వయసంటూ లేదు. హైస్కూలు వయసు నుండే మార్కులు, ర్యాంకులు పేరున మానసిక సమస్యలతో మనసు బీటలు వారుతుంది. ఈ కారణంగానే పెద్దయిన తరువాత వారు మానసిక ఆనందాన్ని కోల్పోతున్నారు. ఆరోగ్యం మానసిక ఆనందంతోనే ముడిపడి ఉంది. కోల్పోతున్న ఈ ఆనందాన్ని, ఆరోగ్యాన్ని తిరిగి పొందడమెలా?

మానసిక అనారోగ్యం ఒక్కసారిగా ఎక్కడినుండో ఊడిపడదు. ఇది చిన్నతనం నుండే మొదలవుతుంది. తమకంటూ సొంత అభిప్రాయం, ఆలోచన ఏర్పడడం, వచ్చిన ఆలోచనలు అమలు చేయాలనుకోవడం దగ్గర నుండి మొదలవుతాయి సమస్యలు. పిల్లలు సరిగా ఆలోచించలేరని, పెద్దలు తమ అభిప్రాయాలను వారి మీద రుద్దడంతో ఈ సమస్యలు మరింత తీవ్రరూపం దాలుస్తాయి. దీనికి ఉదాహరణ చదువు పట్ల పిల్లల అభిరుచి, అభిప్రాయాలు తెలుసుకోకుండా తల్లిదండ్రులు తమ ఇష్టాలను వారి మీద రుద్దుతుంటారు. ఇక్కడినుండే పిల్లల్లో ఒక విధమైన సంఘర్షణ, ఆత్మన్యూనతా భావంతో పాటు పెద్దల మీద వ్యతిరేకత కూడా మొదలవుతుంది. ఇది ఇలాగే కొనసాగితే వారు పెరిగి పెద్దయిన తర్వాత ఇదే మానసిక, శారీరక అనారోగ్యానికి దారితీస్తుంది. ఫలితంగా పైకి బాగానే కనిపించినా ఏదో తెలియని మానసిక వేదనతో బాధపడుతుంటారు.

యువత దగ్గర నుండి వృద్ధుల వరకు అందరినీ బాధిస్తున్నది ఈ మానసిక, శారీరక అనారోగ్యం. మానసిక అనారోగ్యానికి, శారీరక అనారోగ్యానికి చాలా దగ్గరి సంబంధం ఉంది. కారణం లేకుండా కోపం తెచ్చుకోవడం, ప్రశాంతంగా వుండలేకపోవడం, ఇతరులతో మాట్లాడడానికి ఇష్టపడకపోవడం, ముభావంగా ఉండడం వంటివన్నీ మానసిక అనారోగ్యానికి చిహ్నాలే. ఇలాంటి సమస్యలే ముందు ముందు తీవ్రమైన అనారోగ్యానికి దారి తీస్తాయి.

ఆఫీసులో పని ఒత్తిడి, వృత్తిలో పోటీ, వీటి కోసం చేసే పోరాటం వంటివి మానసిక, శారీరక ఆరోగ్యం మీద తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. దీనికి ఒక రంగమని లేదు. అన్ని రంగాల్లో పని చేసేవారూ వీటి బారిన పడుతున్నారు. ముఖ్యంగా బయటికెళ్లి పని చేసే మహిళల మీద ఈ ప్రభావం ఎక్కువ. అటు ఇంటిని చక్కబెట్టుకోవడం, బయటికెళ్లి వృత్తి బాధ్యతలు నిర్వర్తించడం, ఈ రెండు పనులను బ్యాలెన్స్ చేసుకోడానికి వీరు సతమతమౌతున్నారు. కొన్ని సార్లు వీటికి తోడు ఆర్థిక సమస్యలు జత కూడితే సమస్య మరింత తీవ్రరూపం దాల్చి, ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని అప్పుడప్పుడు వినడం, పేపర్లలో చదవడం చూస్తూనే ఉన్నాం.

చదువు పట్ల పిల్లల అభిరుచి, అభిప్రాయాలు తెలుసుకోకుండా తల్లిదండ్రులు తమ ఇష్టాలను వారి మీద రుద్దుతుంటారు. ఇక్కడినుండే పిల్లల్లో ఒక విధమైన సంఘర్షణ, ఆత్మన్యూనతా భావంతో పాటు పెద్దల మీద వ్యతిరేకత కూడా మొదలవుతుంది.

ఒంటరిగా ఉండడానికి ఇష్టపడడం, నలుగురితో కలివిడిగా మాట్లాడలేకపోవడం, తరచూ చికాకుకు గురి కావడం, పనిలో ఏకాగ్రత లోపించడం, అవసరం ఉన్నా లేకపోయినా బిగ్గరగా అరవడం, అసాధారణంగా ప్రవర్తించడం, తరచూ తనలో తను మాట్లాడుకోవడం, ఆందోళన, ఒత్తిడి, చికాకుగా ఉండడం, విపరీతమైన తలనొప్పి... ఇలాంటి లక్షణాలన్నీ మానసిక అనారోగ్యానికి సంకేతాలే.

మానసిక అనారోగ్యంతో బాధపడేవాళ్లను పిచ్చివాళ్లకింద జమ కట్టేస్తుంటారు చాలామంది. సమస్యలు తీవ్రరూపం దాల్చినప్పుడు ఆలోచించే శక్తి లేక మానసిక శూన్యత ఏర్పడడమే ఈ స్థితికి కారణమని అందరూ ఒప్పుకోవాల్సిన నిజం. ఈ సమస్యను సులభంగా అధిగమించడానికి అవకాశాలు కూడా ఉన్నాయి.

సానుకూల దృక్పథాన్ని, ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవడం, సమస్యల మీద అవగాహన పెంచుకుని, వాటిని అధిగమించే దిశగా పయనించడం అలవాటు చేసుకోవడం, శారీరక ఆరోగ్యం మీద దృష్టి పెట్టడం, యోగా, మెడిటేషన్ వంటివి మానసిక ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుస్తాయి.

పాటలు పాడడం, తోటపని, డాన్స్ చేయడం, పెయింటింగ్ చేయడం లాంటివి అలవాటు చేసుకుంటే కొంత వరకు మానసిక ప్రశాంతతను సొంతం చేసుకోవచ్చు. కొత్త వారితో స్నేహం చేయడం వల్ల విషయ పరిజ్ఞానం పెరగడంతో పాటు మానసిక పరిపక్వత కూడా వస్తుంది.

తీసుకునే ఆహారం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికి కూడా కలగజేస్తుంది. తాజా కూరగాయలు, పండ్లు, యాంటీ ఆక్సిడెంట్ లభించే పదార్థాలు తీసుకోవడం మరింత లాభాన్ని చేకూరుస్తుంది.

- అఖిల

■ సృజన

జాతి వివక్షపై నిరసన స్వరం

నాదిన్ గుండె అసాధారణంగా కొట్టుకుంటుదన్న కారణంగా, ఆమెను శారీరక అలసట చేకూర్చే ఏ పని చేయనిచ్చేది కాదు ఆమె తల్లి. పదేళ్ల ప్రాయంలో బడి కూడా మానిపించింది. దాదాపు ఆమెను ఇంటికే పరిమితం చేసింది. రోజుకు మూడు గంటలపాటు దగ్గరలో ఒక బోధకుడి దగ్గరకు తీసుకుపోయి చదువు చెప్పించేది.

దక్షిణాఫ్రికా సంకట చరిత్రని అసమానమైన స్పష్టతతో, సున్నితత్వంతో, నిజాయితీతో, నాదిన్ రచనలు ప్రపంచానికి ఎత్తి చూపించాయి. నైతిక, మానసిక ఉద్రిక్తతలతో జాతిపరంగా అతలాకుతలమవుతున్న స్వదేశీ పరిస్థితులను తన కథలలో నవలల్లో చూపించిన ధైర్యశాలి ఆమె. యవ్వనకాలంలో వర్ణవివక్షనే ఆమె కథలకు ఇతివృత్తం. కాని అక్కడి జాత్యాహంకార ప్రభుత్వ దమననీతి మీద దాడిచేయకుండా దక్షిణాఫ్రికా జీవితంలోకి లోతుగా పోవడం సాధ్యం కాదనిపించిందామెకు.

కనుకనే జాతివివక్ష కారణంగా జరుగుతున్న అన్యాయాలు, దుర్మార్గాలు, కిరాతకాలకు సంబంధించిన సకల కోణాల్ని ఆమె సాహిత్యం స్పృశించింది. దక్షిణాఫ్రికా సమాజంలోని ఏ కోణాన్నీ అమె స్పర్శించకుండా ఉండలేదు.

నాదిన్ సాహిత్యం వల్లనే వర్ణవివక్ష విశ్వరూపం, అక్కడి శిక్షా నియమాలని అంతర్జాతీయ పాఠకులు అర్థం చేసుకోగలిగారు. స్వేచ్ఛ లేకపోవడం, అర్ధరాత్రులు భద్రతా సిబ్బంది తలుపులు బాది భయోత్పాతాన్ని సృష్టించడం, రాజకీయ ఖైదీలని విడుదలైన వెంటనే మరో ఆరోపణతో అరెస్టు చేయడం ఆ సమయాల్లో అక్కడ సర్వసాధారణం. ఆమె పుస్తకాలు వాటిని అద్భుతంగా చిత్రించి, చదువరులను భీతిగొలిపేటట్టు చేయగలిగాయి. ఆమె సంపూర్ణ రచనలు, అప్పటి సామాజిక చరిత్రను అన్ని కోణాల్లో గ్రంథస్తం చేయగలిగాయి అని విమర్శకులు మెచ్చుకున్నారు.

నాదిన్ తల్లిదండ్రులిద్దరూ పుట్టుకతో యూదులు, దక్షణాఫ్రికాకి వలసవచ్చిన వారే. తండ్రి ఇసాక్ వొల్ఫ్ గోర్డీమెర్ (1887–1962) 13 ఏళ్ల ప్రాయంలో జీవనోపాధి కోసం లిథువానియా నుండి, బ్రిటీష్ సంతతి తల్లి హన్న మియోర్స్ (1897–1973) ఆరేళ్ల ప్రాయంలో కుటుంబంతో పాటు బ్రిటన్ నుంచి వచ్చి దక్షిణాఫ్రికాలో స్థిరపడ్డారు. తండ్రి గడియారాలు తయారుచేస్తూ, బాగుచేస్తూ పేదరికంలో దక్షిణాఫ్రికా బంగారు గనుల ప్రాంతాల్లో పనులు చేస్తూ, కొన్నాళ్లకు ఆభరణాల దుకాణదారు కాగలిగాడు. వారికి ఇద్దరే ఆడపిల్లలు. ఇద్దరిలో నాలుగేళ్ల చిన్నది నాదిన్. సన్నగా చలాకిగా తిరిగే నాదిర్‌కి బాల్యంలో నర్తకి కావాలన్న కోరిక బలీయంగా ఉండేది. దక్షిణఫ్రికా స్ప్రింగ్స్ ప్రాంతంలోని ట్రాన్స్వాల్ (ఇప్పుడది గౌటెంగ్)లో నాదిన్ జన్మించారు. నాదిన్ గుండె అసాధారణంగా కొట్టుకుంటుదన్న కారణంగా, ఆమెను శారీరక అలసట చేకూర్చే ఏ పని చేయనిచ్చేది కాదు ఆమె తల్లి. పదేళ్ల ప్రాయంలో బడి కూడా మానిపించింది.

దాదాపు ఆమెను ఇంటికే పరిమితం చేసింది. రోజుకు మూడు గంటలపాటు దగ్గరలో ఒక బోధకుడి దగ్గరకు తీసుకుపోయి చదువు చెప్పించేది.

చదువుకున్నదంతా ఇంటిలో నాలుగు గోడలమధ్య దొరికిన పుస్తకాలతోనే, పదకొండు సంవత్సరాల ప్రాయం నుండి పదహారేళ్ల ప్రాయం వరకూ తోటివారితో దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇంటిలో రాయడం, చదవడంలో పూర్తిగా నిమగ్నమయి గడిపిందామె. కనుకనే ఆమె రచనలకు కేంద్రం ఆమె బాల్యమే అని విమర్శకులు నిర్ధారించారు. తల్లి బంధనాల నుండి విముక్తి చెందడానికి నాదిర్‌కు అనేక సంవత్సరాలు పట్టింది.

1945లో జొహనెస్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో చదువుకునేందుకు ఒక ఏడాదిపాటు చేరాక, సాహిత్యకారులతో స్నేహాలు ఏర్పడ్డాయి. నల్లవారి దుస్థితి చూసాక చలించిపోయింది. అదే కాలాన సాహిత్యం పట్ల మరింత మమకారం పెరిగింది. దీనితో రచయిత్రి కావాలని నిశ్చయించుకుంది. అయితే ముప్పయ్యేళ్ళు వచ్చే వరకూ దక్షిణాఫ్రికా వదిలి ఎక్కడికీ పోలేదామె. తొమ్మిదేళ్లప్పుడు అధ్యక్షుడు క్రుగెర్‌ని స్తుతిస్తూ ఒక కవితని సృజించారు. పదమూడేళ్ళప్పుడు “రేపురా మళ్లీ” పిల్లల కథ రాశారు. పదిహేనేళ్లప్పుడు మరో పెద్దల కథ రాశారు. ఇవే ఆమె తొలిరచనలు. బీదల పట్ల ముఖ్యంగా అక్కడ నల్లవారి పట్ల సానుభూతితో ఉండే తల్లి నాదిన్‌కు ముందు మార్గదర్శకురాలు.

1949లో డాక్టర్ గెరాల్డ్ గవ్రన్‌ని పెళ్ళి చేసుకుంది నాదిన్. అయితే వారిద్దరూ 1952లో విడాకులు తీసుకున్నారు. అప్పటికే వారికి ఓర్లెన్ ఒక ఆడబిడ్డ పుట్టింది. రెండేళ్ల తరువాత నాజీ జర్మనీ నుండి పారిపోయి వచ్చిన రైనొల్గ్ కస్సిరెర్ (1908–2001)ని రెండో పెళ్ళి చేసుకున్నారు. అతనికిది మూడో పెళ్ళి. మొదటి పెళ్లి మూలంగా అతనికి అప్పటికే ఇద్దరు పిల్లలున్నారు. 1955లో వారికి పుట్టిన కొడుకు హ్యూగ్యోతో. ఆమెకు ఇద్దరు పిల్లలైతే, అతనికి ముగ్గురు అయితే అతనితోనే చివరివరకూ ఆమె దాంపత్యం కొనసాగింది.

జొహనస్ బర్గ్‌లో కార్మికోద్యమ నాయకుడు బెట్టియె డు టోయిట్‌తో మంచి స్నేహ సంబంధాల మూలంగా, ఆమె రాజకీయ అవగాహన విస్తృతమయింది. శ్వేతజాతి జాత్యాహంకార ప్రభుత్వం మీద వ్యతిరేకత పాదుకుంది. 1960లో అతని అరెస్టు, నిర్బంధము, నల్లజాతి

నిరసనకారులమీద షర్పెవిల్లె రక్తమయమైన ఊచకోత, ఆ తరువాత అత్యవసర పరిస్థితి విధించబడడం, ప్రభుత్వం మీద నాదిన్ విరోధాన్ని మరింత పెంచింది. నెల్సన్ మండేలా పక్షాన నిలబడిన న్యాయవాదులు, బ్రం ఫిస్చెర్, జార్జ్ బిజోస్‌లతో స్నేహం ఏర్పడింది. మండేలా 27 ఏళ్ళ కారాగారానికి ముందే, 1962 నుండి మండేలాకు కూడా ఆమె అలా దగ్గరయ్యారు. ఆమె రచనలన్నిటినీ మండేలా జైలులో ఉండగానే చదువుకున్నారు. ఆమె పట్ల ఏర్పడ్డ గౌరవంతో జైలు నుండి విడుదలయిన తరువాత ఆమెనే మొదట చూడాలన్నారు.

నాదిన్ మొదటి కథా సంకలనం-"ముఖాముఖి" 1949లో, మొదటి నవల "అబద్ధాల రోజులు" 1953లో వచ్చాయి. ఈ మొదటి నవల చాలావరకు ఆమె ఆత్మకథ, బాల్యంలో ఒక చిన్న గనుల ప్రదేశంలో నుండి వచ్చి జొహెనెస్ బర్గ్ లాంటి పట్టణానికి వచ్చాక ప్రపంచాన్ని చూడడం అందులో చిత్రితమయింది. 1952లో "సర్పం మెత్తని స్వరం ఇంకా మరి కొన్ని కథలు" వచ్చింది. "చెప్పే సమయం: రాయడం బతకడం, 1954-2008"- ఆమె అకాల్పనిక సాహిత్యం అంతా కలిపి బృహత్ గ్రంథంగా 2010లో విడుదలయింది. 1948 నుండి 1994 మధ్య వర్ణవివక్ష కాలంలో ఆమె మూడు నవలలు నిషేధానికి గురయ్యాయి. అందులో మొదటిది 12 ఏళ్ల పాటు, 1958లో ఆమె రెండవ నవలగా వచ్చిన "అన్యదేశస్థుల ప్రపంచం" (కొత్తగా వచ్చిన ఒక బ్రిటిష్ పౌరుడు తాను ఏవిధంగానూ కలపలేని, రెండు ప్రత్యేకమైన సామాజిక వర్గాల్ని ఎదుర్కొన్న వైనం). రెండవది పదేళ్లపాటు-1966లో వచ్చిన "వెనకటి బూర్జువా ప్రపంచం" (జాతి వివక్ష వ్యతిరేక ప్రతిఘటన ద్రోహి, తన పూర్వ భర్త మూలాన తట్టుకోలేక ఒక స్త్రీ ఆత్మహత్య చేసుకున్న ఉదంతం). మూడవది అప్పటికే ఆమెకు అంతర్జాతీయ గుర్తింపు రావడం మూలంగా కొన్ని నెలల పాటు-1979లో వచ్చిన "బర్గర్ల కూతురు" (విప్లవవాదుల కుటుంబంలో తండ్రి తాను నమ్మిన సిద్ధాంతానికి అమరుడయినప్పుడు, అతని కుమార్తె తీసుకున్న స్వీయ నిర్ణయం కథాంశం). ప్రౌస్ట్, తుర్గెనెవ్, చెకోవ్, డోస్టొవ్ స్కీ వంటి రచయితల్ని ఆమె ఇష్టంగా చదువుకున్నారు.

1983లో "ఒక కెంపుగాజు ముక్క" పేరుతో హిందూ ముస్లిం కుటుంబం మీద కథ రాసారు. 1990లో "నా కొడుకు కథ" పేరున మిశ్రమ సంతతి వారిమీద నవల రాసారు. 1974లో ది కన్జర్వేషనిస్టు నవలకు బుకర్ బహుమతి లభించింది.

వర్ణవివక్ష మీద విజయం సాధించక ముందే, జాత్యాహంకార ప్రభుత్వాన్ని పడదోసి అక్కడ జాతీయత వెల్లివిరుస్తుందని ఆమె తన రచనల్లో చిత్రించారు. 1981లో వచ్చిన "జూలై ప్రజలు" నవలలో జూలై ఒక నల్లజాతీయుడు. అప్పటివరకూ అతని యజమానిగా ఉన్న శ్వేతజాతీయుని కుటుంబాన్ని రక్షించేందుకు తన మారుమూల ఏకాంత గ్రామంలో వారందరికీ ఆశ్రయమిస్తాడు. ఆమె పుస్తకాలు జాతి రాజకీయాలు చర్చించుకునే కుటుంబంలో నుండి వచ్చిన ఒక మహిళ రాసినట్టివిగా ఉన్నా, ఆశ్చర్యంగా ఆమెకు ఆ వాతావరణం లేదు. పైగా ఆమె ప్రపంచంలో అల్పసంఖ్యాక శ్వేతజాతీయులు నల్లవారి మధ్య నివసించారు. ఆమె చెప్పుకున్నట్లు "అడవిలో చెట్ల మధ్య కొందరు మనుషులు నివసిస్తున్నట్లు".

వివాదాలకు ఎంత దూరంగా ఉండాలనుకున్నా, రాజకీయాలతో పెనుగులాట నాదిన్‌కు తప్పలేదు. దక్షిణాఫ్రికా లాంటి సమాజంలో రాజకీయాలకు దూరంగా ఉండడం ఎవరికీ సాధ్యం కాదని ఆమె చెప్పారు. వివక్షకు వ్యతిరేకంగా కేవలం రచనలకే పరిమితం కాలేదు నాదిన్. నల్లజాతి పోరాటకారులకు అనేక రూపాల్లో అండగా నిలిచారు. అవసరమైన వారికి రహస్యంగా సందేశాలు పంపించారు.. మిత్రులను, పోరాటంలో నిమగ్నమైన ప్రముఖులను పోలీసుల బారి నుంచి కాపాడటానికి, ఎవరికీ తెలియకుండా సరిహద్దులు దాటించడానికి సహకరించారు. ఈ అంశాలని రచనాక్రమంలో మరింత ధైర్యంగా, అద్భుతంగా నవలల్లో, కథల్లో సృజించారు. జాత్యాహంకార ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీలో కొన్నిసార్లు క్రియాశీలకంగా వ్యవహరించారు.

వివాదాలకు ఎంత దూరంగా ఉండాలనుకున్నా, రాజకీయాలతో పెనుగులాట నాదిన్‌కు తప్పలేదు. దక్షిణాఫ్రికా లాంటి సమాజంలో రాజకీయాలకు దూరంగా ఉండడం ఎవరికీ సాధ్యం కాదని ఆమె చెప్పారు.



అంతర్గత అలజడుల మూలంగా, అంతర్జాతీయ ఒత్తిడుల మూలంగా చివరకు దక్షిణాఫ్రికాలోని జాత్యాహంకార ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. 1990లో మండేలా విడుదలయ్యారు, 1991లో వర్ణవివక్ష రద్దయింది. 1993లో కొత్త రాజ్యాంగం ఏర్పడింది, 1994లో ఎన్నికలతో అడ్డుగోడలన్నీ కూలిపోయాయి. ఆ తరువాత కొన్ని సంవత్సరాలలోనే మండేలా అధ్యక్షుడయ్యారు, నాదిన్‌కు నోబెల్ బహుమతి వచ్చింది. జాతి వివక్ష లేకపోవడంతో ఆమెకు రాసేందుకు వస్తువు లేకుండా పోయిందని అన్నవారి విమర్శల్ని దీటుగా ఎదుర్కొన్నారు.

2001లో నాదిన్ 'ది పికప్' అనే నవల రాసారు. విస్తారంగా రాయడం కొనసాగించారు. దక్షిణాఫ్రికాలో ప్రమాదభరితంగా విస్తరిస్తున్న ఎయిడ్స్ వ్యాధి మీద యుద్ధం చేస్తున్న వారి పక్షాన నిలబడ్డారు.

2006లో నాదిన్ ఇంటిలో దొంగలు పడి నానా బీభత్సం సృష్టించినపుడు, "ఎందరో అనుభవించేది, నావంతు వచ్చినపుడు నాకూ అనుభవంలోకి వచ్చింది" అన్నారు.. నీ చుట్టూ ఉండే ప్రభావాల్ని నువ్వు అంగీకరించొచ్చు, తిరస్కరించొచ్చు, నీ సాంఘీక ఆవరణతో నువ్వు తయారవుతావు పెరుగుతావు-అని ఆమె అభిప్రాయం రచయిత కావడమంటే ప్రజా జీవనంలోకి ప్రవేశించడం.

"బ్రహ్మాండమైన ఆమె ఇతిహాస రచనల మూలంగా, ఆల్ఫ్రెడ్ నోబెల్ మాటల్లో, మానవాళికి ఆమె ఒక గొప్ప మహోపకారం చేసారు" అని నోబెల్ బహుమతి ప్రదాతలు కొనియాడారు. 15 విద్యా సంస్థలనుండి గౌరవ డాక్టరేట్లు లభించాయి, అనేక ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాలు అందుకున్నారు. తన జీవితకాలంలో

14 నవలలు, 16 కథా సంకలనాలు, నాన్‌ఫిక్షన్ రచనలు ఎన్నో చేశారు.. ఆమె చివరి 15వ నవల "వర్తమానం లాంటి సమయం లేదు" 2012లో వచ్చింది. 40 భాషల్లో ఆమె సాహిత్యం అనువాదమయింది. దక్షిణాఫ్రికాలో తప్ప మరెక్కడా నివసించడానికి ఇష్టపడని నాదిన్ 90 ఏళ్ల ప్రాయంలో జొహానస్‌బర్గ్‌లోనే ప్రశాంతంగా రాత్రి నిద్రలో మరణించారు.

- ముకుంద రామారావు, 9908347273

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

జ్ఞాపకాలను పదిలపర్చుకుందాం...

సరికొత్త ఆశలు.. ఆశయాలతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టాం. మనం వేయబోయే ప్రతి అడుగూ... మనం చేసే ప్రతి ఆలోచనా... మనకో మధుర స్మృతిగా.. తీయని జ్ఞాపకంగా మిగుల్చుకోవాలని అనుకోనివారుండరు. వాటిని ఎంతో జాగ్రత్తగా డైరీల్లో రాసుకోవడం పరిపాటే. ప్రస్తుతం అధునాత టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత అన్ని పనులూ ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి. డైరీ రాసుకోవడం దగ్గర నుంచి రోజువారీ పనులను షెడ్యూల్ చేసుకునే వారకు అన్నీ అన్‌లైన్‌లోనే నిర్వహించుకోవచ్చు. ఈ స్పీడ్ యుగంలో పక్కవారి గురించి పట్టించుకునే తీరిక కూడాలేని బిజీ జీవితం. క్షణం తీరికలేకుండా నిత్యం కంప్యూటర్లతో గడుపుతూ ప్రత్యేకంగా డైరీ రాయాలనుకోడం, క్యాలెండర్లు, రిమైండర్లు మెయింటెయిన్ చేయడం కొంచెం కష్టంగానే వుంటుంది. ఒక్కోసారి పనిఒత్తిడిలో ముఖ్యమైన తేదీలను... ఆత్మీయుల పుట్టిన రోజులను, పండుగలకు సైతం శుభాకాంక్షలు చెప్పడం కూడా మర్చిపోవడం సాధారణంగా జరిగేదే.



ఇలాంటి విషయాలన్నిటినీ సమయానికి గుర్తుచేసే సౌలభ్యం, సదుపాయాలు మన కంప్యూటర్‌లోనూ, నెట్‌లోనూ అనేకం ఉన్నాయి. ఈ సాంకేతిక యుగంలో జీవితమంతా కంప్యూటర్‌తోనో... స్మార్ట్‌ఫోన్ల సహచర్యంతోనో గడిచిపోతూ, సాధారణ డైరీల్లో రాసుకునే తీరికలేనివారు కంప్యూటర్, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లలోని సదుపాయాలను ఉపయోగించుకోవచ్చు. వాటిలో కంప్యూటర్ ప్రోగ్రామ్స్‌లో వుండే అడ్రస్‌బుక్ ఒకటి. అదేవిధంగా ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఇమెయిల్స్‌ను ఉపయోగిస్తూనే వుంటారు. జిమెయిల్, యాహూ, రెడిఫ్, హాట్‌మెయిల్... ఇలా ఏదైనా కావచ్చు. వాటిలోని క్యాలెండర్, రిమైండర్లను ఆయా అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవచ్చు. ఇవే కాకుండా 'ఎఫిషియంట్ డైరీ' వంటి అనేక సాఫ్ట్‌వేర్స్ నెట్‌లో దొరుకుతున్నాయి. వాటిని ఉపయోగించుకొని ఆన్‌లైన్ మన జ్ఞాపకాలను పదిలపర్చుకోవచ్చు.

గూగుల్ క్యాలెండర్ :

మీ పనులన్నీ చక్కబెట్టి చూసుకోవడానికి గూగుల్ ఫ్రీగా ఇచ్చే పర్సనల్ సెక్రటరీయే గూగుల్ క్యాలెండర్ (https://www.google.com/calendar). ఇందుల్లో మనం మన పనులు ఎప్పుడు చెయ్యాలో, ఎక్కడో, ఎవరెవరు అందులో భాగస్వాములో, ఏయే రోజుల్లో అదే పని పునరీకృతమవుతుందో చూసుకోవచ్చు. అంతే కాదు, మన దగ్గరవాళ్ళ పుట్టిన రోజులు, పండగలు-పబ్బాలు ఒక్కసారి నోట్ చేస్కుంటే చాలు, ఇంక జీవితకాలం మొత్తం మనకి గుర్తుచేస్తుంది. అంతేకాదు మన మొబైల్ నెంబర్ ఇస్తే సమయానికి అదే మెసేజ్ కూడా పంపిస్తుంది. అలాగే మనకి 24x7 ఇంటర్నెట్ సదుపాయం ఉంటే మన కంప్యూటర్ మీద క్యాలెండర్, మొబైల్‌లో ఉన్న క్యాలెండర్‌కు కూడా దాన్ని అనుసంధానించుకోవచ్చు. ఇంతేనా అనుకుంటే ఇంకా ఉన్నాయ్! మన క్యాలెండర్ మన స్నేహితులతో పంచుకోవచ్చు. అప్పుడు మనం ఎప్పుడు ఖాళీగా ఉంటామో, ఎప్పుడు బిజీగా ఉంటామో వాళ్ళకి తెలుస్తుంది.

గూగుల్ అందించే అదనపు సౌకర్యాల్ని జీమెయిల్‌లోనే యాక్సెస్ చేయాలంటే Integrated Gmail యాడ్‌ఆన్ ఉండాల్సిందే. నిక్షిప్తం చేయగానే జీమెయిల్ రీఫ్రెష్ అయ్యి రూపాన్ని మార్చుకుంటుంది. ఇన్‌బాక్స్, గూగుల్ రీడర్, గూగుల్ క్యాలెండర్ జాబితాగా కనిపిస్తాయి. మొదట్లో ప్రివ్యూ వీడియో ద్వారా వీటిని వాడుకునే విధానాన్ని చూడొచ్చు. ఇండెక్స్ బాక్స్‌లో ఉండి మెయిలింగ్ వ్యవహారాల్ని చూడొచ్చు. రీడర్‌లోకి వెళ్లి వెబ్ వరల్డ్‌లో చోటు చేసుకుంటున్న విశేషాల్ని బ్రౌజ్ చేసి చూడొచ్చు. ఆసక్తిగా అనిపించిన వాటిని గూగుల్ ప్లస్ నెట్‌వర్క్‌లో షేర్ చేయవచ్చు. వ్యక్తిగతంగా మెయిల్ రూపంలో పంపవచ్చు. ఇక క్యాలెండర్ సర్వీసుతో షెడ్యూల్‌ని నిర్వహించుకోవచ్చు. ఈవెంట్ ప్లానింగ్ చేసుకుని ఎసెమ్మెస్ ఎలర్ట్‌లను పెట్టుకోవచ్చు. మీ మొబైల్‌ని గూగుల్ క్యాలెండర్‌తో సింక్రనైజ్ చేయవచ్చు. http://goo.gl/6WFm8

డెస్క్‌టాప్ క్యాలెండర్ :

డెస్కుటాప్ క్యాలెండర్‌ను ఉపయోగించుకోవడం చాలా సులభం. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోగానే మన కంప్యూటర్ డెస్కుటాప్‌పై ఒక వాల్‌పేపర్ మాదిరిగా మారిపోతుంది. దీనిలోని సెట్టింగ్స్ నుండి తేదీలు ఎప్పటి నుండి ఎప్పటివరకు కనిపించాలో కూడా అరేంజ్ చేసుకోవచ్చు. మనకు కావాల్సిన తేదీపైన డబుల్ క్లిక్ చేసి ముందుగానే మన ప్రోగ్రామ్స్‌ను రాసుకోవచ్చు. ఇంగ్లీషుతో పాటు తెలుగు యూనికోడ్‌లోనూ రాసుకోవచ్చు. బ్యాక్‌గ్రౌండ్ వాల్‌పేపర్స్ మార్చుకోవచ్చు. మన పిసీ డెస్కుటాప్ మీదే వుంటుంది కాబట్టి ఎప్పటి షెడ్యూల్ అప్పుడు మర్చిపోకుండా చూసుకోవడానికి సౌకర్యంగా వుంటుంది. ఇది చాలాచిన్న అప్లికేషన్. దీన్ని http://www.desktopcal.com/usa/index.php నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

toggl:

రోజులో ఏయే పనులకు ఎంత సమయం కేటాయిస్తున్నామో, ఎక్కడ సమయం వృథా అవుతోందో లాంటి వివరాలను విశ్లేషించుకోవాంటే https://www.toggl.com లోకి వెళ్లాలి. ఈ టైం ట్రాకింగ్ సర్వీసును పీసీ, మ్యాక్, మొబైల్, ట్యాబ్లెట్‌ల్లో వాడుకోవచ్చు. దీంట్లో సభ్యులై చేయాల్సిన పనుల్ని జాబితా పెట్టుకుని వాటిపై ఎంతెంత సమయం కేటాయిస్తున్నామో ట్రాక్ చేయవచ్చు.

డైరీ రాయాలనుకుంటే...:

కొత్త ఏడాది ప్రారంభమైన ప్రతిసారీ డైరీ రాయాలని చాలామంది అనుకుంటారు. కానీ ఆచరణలో పాటించేవారు కొద్దిమంది మాత్రమే. వ్యక్తిగత విషయాలుంటాయి కాబట్టి భద్రంగా దాయడం కూడా కష్టమే. ఇలాంటి ఇబ్బందులేమీ లేకుండా కావాల్సినప్పుడు... కావాల్సినట్లుగా... ఆన్‌లైన్‌లో డైరీ రాసుకోవచ్చు. ఎన్ని పేజీలైనా... ఎన్ని సంవత్సరాలైనా భద్రపరచుకొనే అవకాశం వుంది. మీరు చేయాల్సిందల్లా ఈ అవకాశాన్ని

కల్పిస్తున్న http://www.my-diary.org, http://mydeardiary.com వంటి సైట్లలో లాగిన్ అవడమే. అయితే ప్రైవసీకి సంబంధించి ఆయా సైట్లలో వారిచ్చిన హామీలను క్షుణ్ణంగా చదవాలి. ఆ తర్వాతే వ్యక్తిగత వివరాలను రాయడం ప్రారంభించాలి.

ఎఫిషియంట్ డైరీ :

మన అనుభవాలను అనుభూతులను, ముఖ్యమైన తేదీలను రాసుకోవడానికి చక్కగా ఉపయోగపడుతుంది. ఈ ఉచిత వ్యక్తిగత డైరీ సాఫ్ట్‌వేర్‌లో మీ అనుభవాలు, ఐడియాలు మరియు కావాల్సిన సంగతులను పొందుపర్చుకోవచ్చు. టైప్ చేసుకోవడానికి వీలుగా రిచ్ టెక్ట్స్ ఎడిటర్ వుంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఓపెన్ చేసుకొన్న తర్వాత 'న్యూ డైరీ ఎంట్రీ' బటన్‌పై క్లిక్ చేస్తే టైప్ చేసుకోవడానికి వీలుగా ఒక టెక్ట్స్‌ప్యాడ్ వస్తుంది. దీనిలో టైప్ చేసుకోవచ్చు. అదేవిధంగా ఈ సాఫ్ట్‌వేర్‌లో మీ ఎంట్రీలకు టేబుల్, ఎమోషన్స్, పిక్చర్స్, బ్యాక్ గ్రౌండ్ కలర్, ఎటాచ్‌మెంట్స్ జతచేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం http://www.efficientdiary.com



చూడొచ్చు.

క్యాలెండర్ యాప్స్ :

స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత యాప్ వినియోగం బాగా పెరిగింది. అది క్యాలెండర్స్‌కు వర్తిస్తుంది. విభిన్న రకాల క్యాలెండర్లను అందించేందుకు రకరకాల యాప్స్ ఇప్పుడు అందుబాటులో వున్నాయి. గూగుల్ ప్లే స్టోర్‌లో ఉచితంగా లభ్యమయ్యే వాటిలో aCalendar యాప్ ఒకటి. దీన్ని ఉపయోగించడం కూడా సులభమే. దీన్ని https://play.google.com/store/apps/details?id=org.withouthat.acalendar నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇలాంటివి అనేకం అందుబాటులో వున్నాయి. ఎవరి అభిరుచిని బట్టి తదనుగుణమైన యాప్స్‌ను గూగుల్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వీటితోపాటు స్మార్ట్‌ఫోన్, ట్యాబ్స్‌లోనూ క్యాలెండర్ సదుపాయం వుంది. రోజువారీ కార్యక్రమాలను వాటిలోను నోట్ చేసుకోవడంతో పాటు అవసరమైన సమయానికి గుర్తు చేసేలా రిమైండర్స్ కూడా పెట్టుకోవచ్చు.

ఆన్‌లైన్ క్యాలెండర్, డైరీ, యాప్స్‌తో ఈ నూతన సంవత్సరంలో మీ దైనందిన కార్యక్రమాలను క్రమబద్ధీకరించు కోవచ్చు. నూతన సంవత్సర శుభాకాంక్షలతో ఇక ప్రారంభించండి మరి..

రచయిత సెల్ : 9490099219

జోక్స్ కార్నర్

తొముకోవు

టీచర్ : రాంబాబు! పాము కాటేస్తే విషం ఎందుకు ఎక్కుతుంది?

రాంబాబు : అవి పళ్ళు తోముకోవు కాబట్టి.

సెలవు

టీచర్ : అవేజ్! ఒక కోడి రోజుకో గుడ్డు పెడితే వారానికి ఎన్ని గుడ్లు పెడుతుంది?

అవేజ్ : ఆరు టీచర్.

టీచర్ : అదేంటి? వారానికి ఏడు రోజులు కదా?!

అవేజ్ : ఆదివారం సెలవు కదా టీచర్.

కలిపిన



టీచర్ : మోహన్! చెరకు రసం ఎందుకు తియ్యగా ఉంటుంది?

మోహన్ : వాటిని పెంచేటప్పుడు చక్కెర కలిపిన నీళ్ళు పోస్తారు టీచర్.

రేపటి పని

శ్రీకాంత్ : అదేంటిరా గంగాధర్! ఇంతగనం అన్నం తింటున్నావు?

గంగాధర్ : పద్యంలో ఉంది కదారా, రేపటి పని ఈ రోజే చేయాలని. అందుకే.

మౌనవ్రతం



భాస్కర్ : ఇందాకట్నుంచి కుక్కలా అరుస్తున్నాను. ఒక్క ముక్కైనా మాట్లాడవేంటిరా. మాట్లాడు.

లక్ష్మణ్ : నేను మౌనవ్రతంలో వున్నాను. అందుకని మాట్లాడ్డం లేదు.

భాస్కర్ : ఇప్పుడెలా మాట్లాడావు?

లక్ష్మణ్ : మౌనవ్రతంలో ఉన్నట్లు నీకు తెలియాలని.

కడిగాను



గౌతమి : అదేంటి? బియ్యం సబ్బు వాసన వస్తున్నాయేమిటి?

రమ : అందులో పురుగులు కనిపిస్తే నేనే సబ్బుతో కడిగాను.

బుక్‌లో

మాస్టారు : ప్రపంచంలో అతి పెద్ద సముద్రం ఏది?

పరశురాం : ప్రస్తుతానికి ఈ జవాబు నా మెదడులో లేదు. నా బుక్‌లో మాత్రం తప్పకుండా ఉంటుంది.

తెలియదు

టీచర్ : ప్రపంచంలో అతి పెద్ద ఖండం ఏది?

రాము : తెలియదు టీచర్.

టీచర్ : అంత పెద్ద ఖండం గుర్తుండకపోతే ఎలా?

రాము : అంత పెద్ద ఖండం నా బుర్రలో ఎలా పడుతుంది టీచర్. అందుకే గుర్తులేదు.

– రత్నావత్ పంచారామ్, ఊట్‌పల్లి, నిజామాబాద్

అందుకున్నాం ■ **సమీక్షలు**



భారతదేశంలో స్త్రీ
(ఆదిమకాలం నుంచి
ఆధునిక కాలం వరకు)
యస్.డి.వి.అజీజ్
వెల: 100/-, పేజీలు :112
ప్రతులకు : యస్.అబ్దుల్
అజీజ్, 46/634, బుధవార
పేట, కర్నూల్-518002

అక్షర సేద్యం
బైతి దుర్గయ్య
వెల : 75/-
పేజీలు : 70
ప్రతులకు : బైతి దుర్గయ్య
టీచర్, రాముని పట్ల, చిన్న
కోడూర్, సిద్ధిపేట, మెదక్
సెల్ : 9959007914



సాహితీ ముత్యాలు
వేదార్థం మధుసూదన శర్మ
వెల : 50/-, పేజీలు : 70
ప్రతులకు: వి.పద్మావతి
ఇం.నెం.5-135/సి,
ఎన్మనబెట్ల, కొల్లాపూర్,
మహబూబ్‌నగర్
9959548374

శ్రీ భగవత్‌గీత
కె.బి.సిద్దయ్య
వెల : 50/-
పేజీలు : 75
ప్రతులకు : కె.బి.సిద్ధయ్య
మాజీ ఎమ్మెల్యే
తిరుపతి
సెల్ : 07893983253





అడుగు జాడలు
వేదార్థం మధుసూదన శర్మ
వెల : 50/-
పేజీలు : 63
ప్రతులకు : వి.పద్మావతి
ఇం.నెం.5-135/సి,
ఎన్మనబెట్ల, కొల్లాపూర్,
మహబూబ్‌నగర్
9959548374

సాహసయాత్ర అనుభవసారం



ప్రయాణానికే జీవితం
(పూనె నుంచి జమ్మూకి మోటార్‌సైకిల్ యాత్ర)
ఆంగ్లమూలం: అజిత్ హరిసింఘాని
అనువాదం: కొల్లూరి సోమశంకర్
పేజీలు: 168, వెల: రూ. 120
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు, పబ్లిషర్: 99484 64365

లోకం పోకడ తెలియాలంటే ప్రయాణించాలి. సుదీర్ఘమైన ప్రయాణాలు మానవ జీవితంలోని వైవిధ్యాన్ని తెలుసుకోడానికి ఉపకరిస్తాయి. దీనిని గుర్తించిన అజిత్ హరిసింఘాని పూనె నుంచి జమ్మూ వరకు మోటార్‌సైకిల్ యాత్ర చేశారు. ఆ తర్వాత తన అనుభవాల్ని ఆంగ్లంలో పుస్తకంగా రాశారు. దానిని 'ప్రయాణానికే జీవితం' శీర్షికన కొల్లూరి సోమశంకర్ తెలుగులోకి అనువాదం చేసి ప్రచురించారు. ఆద్యంతం అత్యంత ఆసక్తికరంగా సాగిన రచన ఇది. ముందుమాటలో దాసరి అమరేంద్ర చెప్పిన మాటల్లో పుస్తకం గురించి తెలుసుకోవచ్చు: "పదేళ్ళ క్రితం నడివేసవిలో నెలరోజులపాటు ఓ స్పీచ్ థెరపిస్టు పూనె నుంచి అహ్మదాబాద్, మౌంట్ అబు, జైపూర్, ఢిల్లీ, చండీగఢ్‌ల మీదుగా హిమాలయ పర్వత పాదాలకు చేరి అక్కడి నుంచి మనాలీ, రోహతాంగ్, కేలాంగ్, దార్చా, పాంగ్‌ల మీదుగా లేహ్ పట్టణానికీ, అక్కణ్ణించి కార్గిల్, ద్రాస్, శ్రీనగర్, పట్నీటాప్‌ల మీదుగా జమ్మూ వరకూ చేసిన నాలుగు వేల మూడు వందల కిలోమీటర్ల అద్భుత సాహసయాత్ర ఈ ప్రయాణానికే జీవితం". ఈ ప్రయాణమంతా ఒక మోటార్‌సైకిల్ మీద చేయడం విశేషం. సముద్రమట్టానికి ఇరవై వేల అడుగుల ఎత్తున టూవీలర్ మీద ప్రయాణం నిజంగానే ఓ సాహసం. అలాంటి ప్రయాణంలోని అనుభవాల పరంపరనే ఈ పుస్తకం. దీనిని అత్యంత ఆకర్షణీయంగా అనువాదం చేయడం సోమశంకర్ సాఫల్యం. ఈ పుస్తకాన్ని తెలుగులోకి తీసుకురావాలన్న అతని తపన తెలుగు పాఠకుల మీద అతని ప్రేమనీ, నమ్మకాన్నీ తెలియజేస్తుంది. ప్రయాణించాలన్న ఆసక్తినీ, ఉత్సాహాన్నీ రేకెత్తించడం ఈ పుస్తకం సాధించిన విజయం.

కొత్తచూపునిచ్చే కవిత్వ వ్యాసాలు



కవిత్వంలో సమాంతరరేఖలు-సంక్షోభాలు (వ్యాసాలు)
రచన: డాక్టర్ దేవరాజు మహారాజు
పేజీలు: 110, వెల: రూ. 110,
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు

కవిత్వాన్ని ఇష్టంగా చదవడమే కాకుండా అందులోని సారాంశాన్ని విడమరచి అందంగా చెప్పడం ఓ కళ. ఈ కళా నైపుణ్యం డాక్టర్ దేవరాజు మహారాజు కవిత్వవ్యాసాల్లో కనిపిస్తుంది. 'కవిత్వంలో సమాంతరరేఖలు - సంక్షోభాలు' శీర్షికన ఈ మధ్యన వచ్చిన వారి పుస్తకంలో మొత్తం 22 వ్యాసాలున్నాయి. విభిన్న భావజాలాలకు చెందిన కవిత్వంలోని మేలిమినీ చెప్పారు రచయిత. ఇతర భాషల్లో తెలుగు కవిత్వం, కుంచించుకుపోతున్న కవిత్వ ప్రక్రియ, అనువాద ప్రక్రియతో కవిత్వం విశ్వవ్యాప్తం కావడం గురించి వివరంగా రాశారు. కవిత్వాన్ని అభిమానించే వారికి పలు అంశాల పట్ల అవగాహననీ, కొత్తచూపునీ అందిస్తాయి ఈ వ్యాసాలు. కాలికట్ నుండి తిరుపతి అనే యాత్రాకథనం ఆకర్షణీయంగా వుంది.

- అశోక్

నయా ఉదారవాద విధానాల విశ్లేషణ



న్యూ మోల్
ఎమిర్ సాదెర్, తెలుగు : ఎం.కోటేశ్వరరావు
పేజీలు:176 , వెల:80 రూ.
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

ప్రపంచంలో నయా ఉదారవాద విధానాలు ఊరేగుతున్న సంగతి మనకు తెల్సిందే. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా 1990వ దశకం నాటికి లాటిన్ అమెరికా ఖండమంతటా నయా ఉదారవాదం విస్తరించింది. అయితే ఉదారవాద విధానాల అమలుకు లాటిన్ అమెరికా ప్రయోగశాలగా ఎందుకు మారింది? న్యూమోల్ (చుంచెలుక) పేరుతో దక్షిణ అమెరికాలో ఒక అగ్రశేణి రాజకీయ సిద్ధాంతవేత్త ఎమిర్ సాదేర్ పుస్తకం స్పానిష్ భాషలో రాశారు. అది ఇంగ్లీష్‌లోకి అనువదించబడింది. నయా ఉదారవాద విధానాలకు దేశంలో మొదటిసారిగా తెలుగు ప్రజలు గురి అయ్యారు. అట్లాంటి పుస్తకాన్ని తెలుగులో అనువదించాలని ఇక్కడి ప్రజాపోరాటాలకు ఆయా దేశాల అనుభవాలు పంచాలని ప్రజాశక్తి భావించటం సంతోషకరం. ప్రజాశక్తి దినపత్రికలో అంతర్జాతీయ రాజకీయాలను పరిశీలిస్తూ అనేక వ్యాసాలు రాసిన సుదీర్ఘ అనుభవం ఉన్న యం. కోటేశ్వరరావుగారు అందరికి అర్థం అయ్యేలా ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. పుస్తకం పేరు పెట్టడానికి ఎయిటెన్త్ బ్రుమైర్ ఆఫ్ లూయి బోనపార్టీ పుస్తకానికి ప్రస్తావనగా ఈ పుస్తకాన్ని నూతన చుంచెలుక (న్యూమోల్) అని పిలువాలనుకున్నారు. ఎందుకంటే "సోషలిజం అంతర్థానం అయింది దానికి భవిష్యత్‌లే"దని ప్రచారం చేస్తున్న కాలం ఇది. చుంచెలుక భూమిలోపల ఎప్పుడు తవ్వుతూనే ఉంటుంది. అది భూమికి దూరంగా వెళ్ళిపోయిందంటే అక్కడ ఖాళీగా ఉండటానికి కాదు తవ్వకాన్ని కొనసాగించటానికే. అది ఎప్పుడూ వెళ్ళిన దారిలో తిరిగిరాదు. చుంచెలుక బయటకు వచ్చిన ప్రతిసారి నూతన భిన్న మార్గాలలో బయటకు వస్తుంది. ఎప్పుడైనా అది మనకు కనిపించకపోతే అది అంతర్థానమైందువలన కాదు. అది కంటికి కనిపించకుండా పోతుందంతే. కాని ఈ జీవి శాశ్వతంగా తవ్వుతూనే ఉంటుంది. ఈనేపథ్యంలో ప్రపంచ విప్లవాలను పరిశీలిస్తే ఏ ఒక్క విప్లవ ఫార్ములా కూడా పునరావృత్తం కాలేదు. దేనికది అద్వితీయమైనది, బహుళ అంశాల సమ్మేళనాల ప్రత్యేకతలతో కూడి ఉన్న రష్యా విప్లవం, చైనా విప్లవం, క్యూబా విప్లవం, చిలీ దేనికదే ప్రత్యేకతలు కలిగి ఉన్నాయి - అనేది రచయిత తెలియజేస్తాడు. చుంచెలుక లాటిన్ అమెరికా దేశాలలో వేస్తున్న కొత్త బాటలను, నయా ఉదారవాద అనుభవాలను గూర్చి రచయిత ఇందులో చర్చిస్తాడు.

రచయిత ఉపోద్ఘాతం కాకుండా 5 భాగాలుగా రాశారు. 1. న్యూమోల్ (చుంచెలుక) 2, లాటిన్ అమెరికాలో ఆధిపత్య సంక్షోభం 3. లూలా రహస్యం 4. వ్యూహం లేని ఒంటరివారు. 5. లాటిన్ అమెరికా భవిష్యత్. లాటిన్ అమెరికా దేశాలను మూడు భాగాలుగా విభజించారు. 1. దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పారిశ్రామిక ప్రాజెక్టులను ప్రవేశపెట్టడంలో జయప్రదం అయినవి. తద్వారా ఉత్పాదక ఏర్పాట్లు చేసుకున్నవి. (బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో) 2. వాటి దిశగా కొన్ని చర్యలు తీసుకున్నవి (పెరు, చిలీ, ఉరుగ్వే) 3. వ్యవసాయ సరుకులు ఎగుమతి చేసేవి లాటిన్ అమెరికా నయా ఉదారవాద విధానాల అమలుకు ప్రయోగశాలగా ఎందుకు మారింది? ఇంత స్వల్ప కాలంలోనే అది బలహీనమైన గొలుసుగా ఎందుకు తయారైంది? లాటిన్ అమెరికాలోని నూతన ప్రభుత్వాలను ఎలా చూడాలి? నయా ఉదారవాద వ్యతిరేక పోరాటం సాధించిన బలాలు ఏమిటి? ఎదుర్కొన్న అటంకాలు ఏమిటి? అని రచయిత చర్చించాడు. భారతదేశంలో కూడా ఈ విధానాలే అమలు అవుతున్నాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలి.

- గడ్డం రమేష్, 9490098484

విభిన్నధోరణులని చిత్రించిన నవల



కొత్త చిగురు (నవల),
రచన: సింహప్రసాద్
పేజీలు: 160, వెల: రూ. 120
ప్రతులకు: శ్రీశ్రీ ప్రచురణలు,
401, మయూరి ఎస్టేట్స్,
ఎమ్.ఐ.జి-2-650,
కె.పి.హెచ్.బి.కాలనీ,
హైదరాబాద్-500 085, ఫోను: 98490 61668

వ్యవసాయ రంగంలో వ్యాపారధోరణుల పెరిగితే వాటిల్లే దుష్పరిణామాల్ని గురించి హృదయాన్ని ఆకట్టుకునేలా రచించిన నవల 'కొత్త చిగురు'. సింహప్రసాద్ రాసిన ఈ నవల అభివృద్ధికీ, వ్యవసాయానికీ, వ్యవసాయ రంగంలోని అవాంఛనీయ ధోరణులకీ సంబంధించిన పలు పార్శ్వాల్ని చిత్రించింది. దీనితోపాటు విద్యావ్యాపారం, మనుషుల్లోని స్వార్థపరత్వం, మానవ సంబంధాల్లోని పరిస్థితి, నగరాల్లోని పలు వృత్తుల, ప్రవృత్తుల వారి జీవనధోరణుల్ని ఈ నవలలో వివరించారు. గణపతి నవరాత్రుల ప్రస్తావన, కార్మికుల సమస్యలు, ఆందోళనలు, పెడదోవపట్టే యువతీయువకుల పోకడలు నవలలో కనిపిస్తాయి. మొత్తంగా ఒక ప్రవాహంలా సాగిపోతుందీ నవల. భాషలోని సారళ్యం వల్ల నవల ఆసాంతం చదివించే శైలిలో వుంది. సంభాషణల్లో సహజత్వం తొణికిసలాడుతుంది.

- కుమార్, 97000 00948

గమనిక

➽ సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.

➽ రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.

➽ పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా:
సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక,
ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500030.

■ ఈ వారం కవిత్వం

నీ కోసం...!

నువ్వందించే ఆనందంతో పాటు
గాయాలనూ స్వీకరిస్తాను.
నువ్వు పరిచే పండు వెన్నెలలోనే కాదు
మండుటెండలలోనూ విశ్రమిస్తాను.
నీ చెంత సుఖాన్నే కాదు
దు:ఖాన్నీ ఆస్వాదిస్తాను.
నీ సమక్షంలో నవ్వులైనా కన్నీరైనా
చిరునవ్వుతో స్వాగతిస్తాను.
నీ కోసం ముళ్ళదారుల్లో సైతం
ప్రయాణిస్తాను.
కటిక నేలపై కూడా కునుకు తీస్తాను.
నీకోసం వచ్చే దారుల్లో
గాజు పెంకులు వేసినా
నిప్పు కణికలు పోసినా
ఆనందంగా నడిచి వస్తాను.
నీ ప్రేమకై సాచిన నా దోసిళ్ళలో
తేనె చుక్కలు చిలకరిస్తావో
విషపు గుళికలు గుమ్మరిస్తావో నీ ఇష్టం
యుగ యుగాలుగా నీ కోసం వేచి వేచి
తనువూ, మనసూ అలసిపోయాయి
నీ హృదయాన్ని పరచవా
కాసేపు విశ్రమిస్తాను...

– పొద్దుటూరి మాధవీలత, 9030573354

టేకు పూలు



మా స్థానం అతి ఉన్నతం
అయినా లేదు మా బ్రతుకు భద్రత
జాతికి 'టేకు' చెట్టుకే వున్నా
ప్రభుత్వ జనానికి మా గోడు పట్టనే పట్టదు
జాతికి పువ్వులమే గాని, ఏ పూజకు
మరి ఏ జడకూ పనికి రాము
చేస్తున్న పని ఘనమైన 'బోధనా' ఏలదే కరణే
అయినా పిల్లగాళ్ళ ఫలితాల హోరు
ఒప్పంద ఉపన్యాసకుల ఉద్యోగ జీవితాలకు
ఓ అశాస్త్రీయ భవబంధంలా!
మా శాస్త్రీయమైన పూతకు 'జాతిబంధం' శాపమైంది
మా మోడు తనపు ఒంటరితనాన్ని చూసే
విద్యా సుమరాజ్యపు 'హరిత పూబోణీలకు' ఎంత చులకనో?!
అయినా కొన్నిటికుంటుంది మానవత్వపు సానుభూతి
హరిపూబోణీలకు నెలవారి 'వసంతం'
మాకు మాత్రం పదినెలలకే పరిమితమైన
పరిమిత జీ(వి)త భత్యాల బక్కపల్చని 'ఆమని'
హరిత పూబోణీలు అవ్వాలని అందరికే వుంది అయినా ఎక్కడ?!
ఒక్క దానికి వందమందిని ఉసిగొలిపి
ప్రతిభకాళ్ళకు రిజర్వేష న్ల బంధం వేసే పోటీ పరీక్షల పోరు.
అదో అదృష్టమయ పద్మవ్యూహ పరిభ్రమణే!!
అందుకే అంటున్నాం 'టేకుపూల' మాదిరిగా
మాకు పూజాఫలాలొద్దు. వేణిల అలంకరణలు అసలొద్దు.
మమ్మల్ని మా జాతి రూపంతో కాక 'విద్యా సుమజాతి'గా చూడమని
ఆ స్థాయిలో చూడకపోయినా! ఆ స్థానంలో బ్రతకనీయమని.
(కాంట్రాక్ట్ లెక్చరర్లు/ ఉద్యోగులు జీవన దుస్థితికి స్పందనగా...)

– అమ్మిన శ్రీనివాసరాజు, 9441317694

2015లో కొత్తలుక్‌తో కలర్‌ఫుల్‌గా కనిపించాలంటే ఈ ఫ్యాషన్ కలర్‌ని ఉపయోగించమని ఫ్యాషన్ నిపుణులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం కొత్తకొత్త రంగులను ఫ్యాషన్ కలర్ పేరుతో విడుదల చేస్తున్న ఫ్యాషన్ ప్రపంచం ఈ కొత్త సంవత్సరం మార్సలా పేరుతో ముదురు మెరూన్ కలర్‌ను పరిచయం చేస్తున్నారు. మరింకెందుకు ఆలస్యం వస్తున్న సంక్రాంతి పండగకు ఈ రంగు దుస్తులను ఎంపిక చేసుకొని కొత్తగా కనిపించండి.

ఎన్నెన్నో వర్ణాలు...
అన్నింటా అందాలు...

రంగులన్నీ తీసుకొచ్చి కుప్పలుగా పోశారా అన్నట్లున్న ఈ ప్రదేశం ఎక్కడిదో తెలుసా? చైనాలోని గుయిలింలోనిది. ప్రతి సంవత్సరం మార్చి నెలలో పీచ్ బ్లూమోస్ చెట్లకు సంబంధించి పండగ జరుగుతుంది. పది వేల ఎకరాల్లో ఈ చెట్ల సాగు చేస్తారు. రంగుల హరివిల్లును తలపించే ఈ ప్రదేశంలో ఉంటే మనసు మైమరచిపోవడమే కాదు, ప్రశాంతత కూడా లభిస్తుంది.